45 ఏళ్ల అనుభవం గల విజనరీ చంద్రబాబు, హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చినట్లే ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారు. మంత్రి లోకేష్ నేతృత్వంలో భారీ పెట్టుబడులు, గూగుల్ డేటా సెంటర్ వంటి పరిశ్రమలు వస్తుండగా, వైసీపీ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 22.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 185 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యం





- పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది
- పోలీసుల గౌరవం పెంచుతాం...వారి కుటుంబాల సంక్షేమం బాధ్యత మాదే
- సోషల్ మీడియా నేరాలు పోలీసుశాఖకు ఓ సవాలు
- రాజకీయ ముసుగులో చేసే నేరాలను కట్టడి చేయాలి

మంగళగిరిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ లాంటి దిగ్గజ ఐటీ సంస్థ ఆంధ్రప్రదేశ్ కు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. వాటిని సంరక్షించటంలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషించాలని సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా దళాల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించారు. పోలీసు సంస్మరణ దినం ఫ్లాగ్ ధరించి.. ఫ్లాగ్ ఫండ్ కు విరాళం ఇచ్చారు. పోలీసుల గౌరవం పెంచటంతో పాటు వారి కుటుంబాల సంక్షేమం చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని.. దానికి మరింత వన్నెతెచ్చేలా పని చేయాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసులను ఉద్దేశించి ప్రసంగించిన సీఎం "దేశంలో శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. 1959 అక్టోబర్ 21న చైనాపై వీరోచిత పోరాటంలో సీఆర్పీఎఫ్ కు చెందిన 10 మంది జవాన్లు అమరులయ్యారు. 2లో...

## ఏఐ, డేటా సైన్స్ పై 'ఎన్ఆర్ఐ కాలేజీ'లో సాంకేతిక సదస్సు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : పేరిచర్ల ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న సాంకేతిక మార్పులపై సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నామని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్, శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం గుంటూరు లక్ష్మీపురం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈనెల 24న జరగబోయే సదస్సుకు మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధి రాజీవ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. మిగతా 2లో...

## డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్ని రంగాల్లో అవకాశాలు ఉంటే.. అన్ని రంగాలను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు అన్ని రకాల చేయూత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సెర్ప్, మెప్మా విభాగాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే అంశంపైనా సీఎం చర్చించారు. డ్వాక్రా, మెప్మా సంఘాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలోని మహిళలను శక్తిని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలి. డ్వాక్రా సంఘాల ఏర్పాటు తర్వాత వాళ్లల్లో చాలా చైతన్యం వచ్చిందని.. వారిలో ఉన్న ప్రతిభ వెలికి తీసేలా అధికారులు కసరత్తు చేయాలని సూచించారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తే... ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం సాధిస్తున్న వర్గంగా తెలుగువారు ఉన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసే రోజుల్లో చాలా మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. నిరక్షరాస్యులుగా ఉన్న మహిళల్లో చైతన్యం తెచ్చి అద్భుతాలు సృష్టించాం. ఇప్పుడు మహిళ సంఘాలు రూ. 20,739కోట్లను పొదుపు చేయగలుగుతున్నారు..దీనికి రెండింతలు బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకోగలుగుతున్నారు. ఈ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు చేయగలిగే సంస్థలు తక్కువ. పైగా మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించడంలో ముందుంటారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించడంలో డ్వాక్రా మహిళలకు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. సుమారు 99 శాతం మందికి పైగా మహిళలు తాము తీసుకున్న బ్యాంకు రుణాలను చెల్లిస్తున్నారు. కేవలం 0.02 శాతం మంది మహిళల మాత్రమే వెనక్కితగ్గుతున్నారు. మిగతా 2లో...



## ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపుదలకు కలిసి పని చేద్దాం

**ఆస్ట్రేలియా (సిడ్నీ)**: సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా ప్రతినిధులు, ఆ సంస్థ సీఈవో వెరోనికా పాపకోస్టా, ఎస్ఐఏ ఎంగేజ్ మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్లేలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సిడ్నీ సమీపాన పారమట్టాలో భేటీ అయ్యారు. సీ ఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా సీఈవో వెరోనికా పాపకోస్టా మాట్లాడుతూ... 2017 నుండి ప్రారంభమైన సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాలోని వైల్డ్ క్యాచ్, ఆక్వాకల్చర్, సీఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన 30వేలకు పైగా వ్యాపారులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మిగతా 2లో...

## 'పేకాట పై డిప్యూటీ సీఎం సీరియస్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్రప్రదేశ్ లో జూదం ఆడటం, జూద కేంద్రాలు నిర్వహించడం, ప్రోత్సహించడం నేరం. ఆన్లైన్ లేదా ఆఫ్ లైన్ లో వీటిని నిర్వహించినా, ఆడినా ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ - 1974 ప్రకారం శిక్షార్హులు అవుతారు అని చట్టం చెబుతోంది. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జూద కేంద్రాలు సాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. 2లో...

## రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతలను కట్టుదిట్టం చేసేందుకు...నేరస్తుల ఆగడాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ 50 కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతలపై విశ్వాసంతోనే విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతాయనిప్రభుత్వం భావిస్తోంది. సమాజంలో అలజడులు ఉంటే పెట్టుబడులు రావని తెలిపింది. ఎవరు ఎక్కడ ఏ తప్పు చేసినా ఆధారాలతో పట్టుకునే పరిస్థితిని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈగల్, శక్తి బృందాలు రాష్ట్ర పోలీసు వ్యవస్థను మరింత పటిష్టంగా నిలిపాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు

**శాంతి భద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం :** 'శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అప్పుడే సంక్షేమం అందరికీ అందుతుంది. ఉపాధి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అప్పుడే కుటుంబంలో, మిగతా 2లో...

## బాణాసంచ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణా సంచా పేలుడు తయారీ కేంద్రం ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున పరిహారాన్ని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు సురేశ్ కుమార్, ఆకే రవికృష్ణలు ఈ ఘటనపై విచారణ నివేదికను అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పేలుడు ఘటనపై విచారణ నిర్వహించామని అధికారులు సీఎంకు వివరించారు. మిగతా 2లో...

## ఏడాదిలో డీఏ బకాయిల చెల్లింపు... స్పష్టమైన జీఓ జారీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, పింఛనర్లకు దీపావళి బహుమతిగా ఒక డీఏ విడుదలకు కూటమి సర్కార్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఏను 3.64 శాతం పెంచుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగుల డీఏ జీవోలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. రిటైర్‌మెంట్ సమయంలో డీఏ బకాయిలు కలిపేలా నిన్న జీవో విడుదల కాగా.. ఆ జీవోలో స్వల్ప మార్పులు చేస్తూ మళ్లీ కొత్త జీవో విడుదలైంది. నేటి నుంచి ఏడాదిలోపు డీఏ చెల్లించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా, రెగ్యులర్ ఉద్యోగుల వేతనంలో ఇప్పటి వరకు డీఏ శాతం 33.67 ఉండగా.. అది 37.31 శాతానికి పెరగనుంది.

## పేద విద్యార్థులకు కేంద్రం అండ... ఏటా రూ.12,000



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) నిర్వహిస్తోంది. 2లో...

## రాష్ట్రంలో కొత్తగా 7 డయాలసిస్ కేంద్రాలు


- **ఎస్.కోట, సీతంపేట, భీమవరం, పీలేరు...ఇతర చోట్ల**
- **గడిచిన ఆర్థిక సంవత్సరంలో కిడ్నీ రోగుల ఉచిత డయాలసిస్ కు పెట్టిన ఖర్చురూ. 164 కోట్లు**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేలా రాష్ట్రంలో అదనంగా 7 కొత్త డయాలసిస్ (రక్త శుద్ధి) కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారంనాడు జారీ చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు ఏరియా ఆసుపత్రుల్లో, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, ఎస్పీఎస్ఆర్ జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట సీహెచ్‌సీ అనువత్రుల్లో ఈ డయాలసిస్ కేంద్రాలు కొత్తగా రానున్నాయని చెప్పారు. ప్రతి కేంద్రంలో ప్రతి రోజూ మూడు సెషన్ల ద్వారా 15 మందికి చొప్పున రక్త శుద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం (పిఎంఎన్డీపీ) కింద ఏర్పాటు కానున్న ఒక్కొక్క కేంద్రంలో సుమారు రూ. 75 లక్షలు విలువచేసే 3 రక్త శుద్ధి యంత్రాలు/పరికరాలు సమకూరుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 232 కేంద్రాలు పనిచేస్తున్నాయి. రానున్న కొత్తవాటితో కలిపి వీటి సంఖ్య 239కు చేరుకుంటుంది.

**ఎస్.కోట, సీతంపేట ఆసుపత్రుల్లోని కేంద్రాలు సిద్ధం:** ఎస్.కోట, సీతంపేట ఆసుపత్రుల్లో కొత్త డయాలసిస్ కేంద్రాలు త్వరలో 2లో...



## ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకరించండి



**ఆస్ట్రేలియా (సిడ్నీ)**: గ్రేటర్ సిడ్నీలో కీలక నగరం పారమట్టా లార్డ్ మేయర్ మార్టిన్ జైటర్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పారమట్టాలో స్థానిక వ్యాపారాలను పెంచడం, మిగతా 2లో...

## ఏఐ, డేటా సైన్స్ పై 'ఎన్ఆర్ఐ కాలేజీ'లో

# సాంకేతిక సదస్సు



(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమ మేథ, డేటా సైన్స్ వంటి ఆధునిక అంశాలతో పాటు ఇంజనీరింగ్ విద్యలో తీసుకోవలసిన సంస్కరణలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు సాంకేతికతలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం నాయకుడు కోయ సుబ్బారావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యలో ప్రపంచ స్థాయిలో జరుగుతున్న మార్పులను స్వాగతించాల్సిన సమయం ఇదని అన్నారు. ఈ దిశగా మైక్రోసాఫ్ట్ ఇండియా ముందుకొచ్చిన తీరు సంతోషకరమని చెప్పారు.

ఈ సదస్సులో ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూ ఉన్నతాధికారులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కోయ సుబ్బారావు (కిట్స్ కాలేజీ చైర్మన్), కుర్ర శరత్ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎన్. ఆర్. ఐ కాలేజీ), పిడికిటి తిలక్ బాబు (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎన్. ఆర్. ఐ కాలేజీ) పాల్గొన్నారు.

## ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపుదలకు కలిసి పని చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

తమ సంస్థ ప్రతి ఏటా ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థకు ఏయూడీ 3.5 బిలియన్ విలువైన వాటాను అందిస్తోందని చెప్పారు. బయో సెక్యూరిటీ, ఎగుమతి పనితీరును మెరుగుపరచేందుకు ప్రభుత్వ, పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు.

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ భారత్ లో అగ్రగామిగా ఉంది. దేశం మొత్తమ్మీద ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో ఏపీ 60శాతానికి పైగా వాటా కలిగి ఉంది, 2024-25లో $ 7.4 బిలియన్ డాలర్ల (రూ. 66 వేలకోట్లు) విలువైన 16.98 మిలియన్ టన్నుల ఆక్వా ఉత్పత్తులు భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఆస్ట్రేలియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో ఆంధ్రప్రదేశ్ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులను అనుసంధానించేందుకు ట్రేడ్ మిషన్లు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలను చేపట్టండి. భారత సముద్ర ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ కోసం ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమదారులు, ఆస్ట్రేలియా దిగుమతి దారుల మధ్య భాగస్వామ్యాలను సులభతరం చేయండి.

ఆక్వా ఉత్పత్తుల నాణ్యత, నిల్వ కాలాన్ని పెంచేందుకు ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ మేనేజ్ మెంట్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను పరిచయం చేయండి. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తూ ఉత్పాదకతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన ఆక్వా కల్చర్, మత్స్య సంపద నిర్వహణకు ఏపీ ఆక్వా పరిశ్రమదారులతో కలిసి నైపుణ్యాన్ని పంచుకోండి. ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ వంటకాలను ప్రోత్సహించి, కలినరీ టూరిజంను ఆకర్షించేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టండి. సముద్ర మట్టాల పెరుగుదల, తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేలా ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ పరిశ్రమలో నిరోధకశక్తిని పెంచే ప్రాజెక్టులపై కలిసి పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు.

## బాణాసంచ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

బాణా సంచా తయారీ కేంద్రంతో పాటు పేలుడు పదార్థాలను కూడా అక్కడే నిల్వ ఉంచారని అధికారులు తెలిపారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు వీటిని తయారు చేస్తున్న సమయంలో ఈ పేలుడు జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. బాణా సంచా తయారీలో ఇనుప పరికరాలు వినియోగించటం వల్లే రాపిడికి మంటలు రేగి ఒక్కసారిగా పేలుడు జరిగిందని స్పష్టం చేశారు. ఈ తయారీ కేంద్రంలో ఏమాత్రం నిబంధనలు పాటించలేదని సీఎంకు వివరించారు.

**కంట్రోల్ రూమ్ ద్వారా బాణాసంచా తయారీపై పర్యవేక్షణ:** భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాణా సంచా తయారీ కేంద్రాలకు లైసెన్సు ఇచ్చే ముందు.. ఆ తర్వాత నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని.. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరగాలని పేర్కొన్నారు. అలాగే బాణా సంచా తయారీలో వినియోగించే పదార్థాల కొనుగోళ్లు, తయారీ వివరాలు ఆన్ లైన్ లో ఉండేలా చూడాలని సూచించారు. నిబంధనలు ప్రకారం లేని తయారీ కేంద్రాలను, ఆథరైజేషన్ లేని వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దని సీఎం స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్టు కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బాణా సంచా తయారీ కేంద్రాలన్నీ నిబంధనల ప్రకారమే ఉండేలా చూడాలని అందులో పనిచేసే వారికి వ్యక్తిగత బీమా తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షకు హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కొత్తగా 7 డయాలసిస్ కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయనున్నాయి. పీపీపీ విధానంలో వీటి నిర్వహణ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించారు. మిగిలిన కేంద్రాలను కూడా పీపీపీ విధానంలో నడిపేందుకు టెండర్లు పిలవాలని రాష్ట్రవైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస (ఏపీఎంఎస్ఐడీసీ)ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కోరింది.

**ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు...:** "ఒక్కొక్క కేంద్రంలో 5 చొప్పున ఆధునిక రక్త శుద్ధి యంత్రాలు అందుబాటులోకొస్తాయి. ప్రతి కేంద్రానికి అనుబంధంగా ప్రత్యేకంగా ఆర్వోప్లాంటు ఉంటుంది. ఈ కొత్త కేంద్రాల ఏర్పాటువల్ల డయాలసిస్ కోసం కిడ్నీ (మూత్రపిండాలు) రోగాలతో బాధపడేవారు దూర ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. సకాలంలో రక్త శుద్ధి జరగడంవల్ల వారికి ఆరోగ్య సమస్యలు కూడా ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. ప్రజాప్రతినిధులు, రోగుల విజ్ఞప్తి మేరకు పైన పేర్కొన్న ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు" మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

**డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా...:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 232లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అనుబంధంగా పీపీపీ విధానంలో 173 కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో 153 కేంద్రాలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో, మిగిలినవి బోధన, ఇతర ఆసుపత్రుల్లో ఉన్నాయి.

వీటి ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వేలాది మంది రోగులు 10,62,008 సార్లు డయాలసిస్ చేయించుకున్నారు.


**పీఎంఎన్డీపీ ద్వారా...:** ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్డీపీ) ఆధ్వర్యంలో 59 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా కూడా అధిక సంఖ్యలో రోగులకు 4,95,186 సార్లు డయాలసిస్ జరిగింది. ఈ కేంద్రాలు జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లో ఉన్నాయి. వైద్యుల సిఫారసు మేరకు రోగులకు సగటున నెలకు 6 నుంచి 8 సార్లు ఉచితంగా రక్తశుద్ధి చేస్తున్నారు.

# శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏటా అక్టోబర్ 21న, పోలీస్ అమర వీరుల దినాన్ని నిర్వహించుకుంటున్నాం. వారి త్యాగాలను, బలి దానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నాం. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. వీరికి నివాళులు అర్పిస్తున్నాను. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులు అంటే నాకెప్పుడూ గౌరవం. పోలీసులు చేసేది ఉద్యోగం కాదు..నిస్వార్థ సేవ." అని అన్నారు.

**ఈగల్- శక్తి బృందాలతో ఆదర్శంగా ఏపీ పోలీస్ శాఖ:** "శాంతిభద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. అప్పుడే సంక్షేమం అందరికీ అందుతుంది. ఉపాధి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అప్పుడే కుటుంబంలో, సమాజంలో సుఖ శాంతులు ఉంటాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమాజంలో అలజడి ఉంటే పెట్టుబడులు రావు. అందుకే నేను ఎప్పుడూ లా అండ్ ఆర్డర్ పై ఖచ్చితంగా ఉంటాను. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతో పరిశ్రమలు, కంపెనీలు వస్తాయి. అదే నమ్మకంతో విశాఖలో గూగుల్ పెట్టుబడులు పెట్టింది. విశాఖలో గూగుల్ పెడుతున్న పెట్టుబడులు దేశంలోనే అతి పెద్ద పెట్టుబడి. 15 బిలియన్ డాలర్లతో ఏఐ డేటా హబ్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది. అప్పుడే ఏపీ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుంది. ఏపీ పోలీసులు అంటే ఒక బ్రాండ్. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంను అణిచి వేయడంలో ఏపీ పోలీసులు ఎంతో పేరు తెచ్చుకున్నారు. పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. సిద్దాంతం పేరుతో, ఆధిపత్యం కోసం, డబ్బుల కోసం నేరాలు చేసే వారు ఉన్నారు. ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట



పడాలి. నేరాల తీరు మారుతోంది. క్రిమినల్స్ అప్ డేట్ అవుతున్నారు. వారి ఆట కట్టించాలంటే పోలీసు శాఖ కూడా అప్డేట్ అయి ఉండాలి. అందుకే సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్... ఇలా టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ప్రతీ 50 మీటర్లకి ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీస్ యంత్రాంగానికి మూడో కన్నులా పనిచేస్తుంది. ఎవరు ఎక్కడ ఏ తప్పు చేసినా రికార్డెడ్‌గా పట్టుకునే వీలు కలుగుతుంది. టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ, అధునాతన పోలీస్ స్టేషన్లు, ఈగల్ , శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రోన్లతో గంజాయి పంటను గుర్తించి ధ్వంస చేస్తున్నారు. స్మగ్లింగ్‌ను అరికడుతున్నారు. అడవుల్లో డ్రోన్లు ఎగరేసి ఎర్ర చందనం దొంగలను కట్టడి చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసు శాఖకు అభినందనలు. డబ్బుల కోసం రౌడీయిజం చేసే ముఠాలుగా మారుతున్న వారిని కట్టడి చేయాలి. తప్పు చేసే వారికి పోలీస్ అంటే భయం ఉండాలి. అప్పుడే నేరాలు తగ్గుతాయి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**రాజకీయ ముసుగు వేసుకుని వస్తున్నారు:** "సమాజంలో అశాంతి సృష్టించి...లబ్ది పొందడం కోసం రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు తయారయ్యారు . వీళ్లు అసలు క్రిమినల్స్ కంటే ప్రమాదం. మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు. సమాజంలో అశాంతిని సృష్టించడానికి రాజకీయ కుట్రలు చేస్తున్నారు. ఫేక్ ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో పోలీసులు మరింత అలెర్ట్ గా ఉండాలి. పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని మతాల మధ్య చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. దీనికి రాజకీయాన్ని జోడించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో సీసీ కెమెరాలతో వాస్తవాలు బయట పెట్టగలిగాం. జీడీ నెల్లూరు మండలంలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి వేరే వారిపై నెపం నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు. సీసీ టీవీలు ఉండటంతో నేరస్తులు దొరికారు. లేదంటే జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని రచ్చ చేసేవారు. కల్తీ మద్యంపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దోషులు ఏ పార్టీ వారైనా చర్యలు తీసుకోవాలని చెప్పాం. రాష్ట్రంలో ఎవరు చనిపోయినా మద్యంతోనే అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న దుష్ప్రచారం, నేరాలు పోలీసులకు అతి పెద్ద ఛాలెంజ్. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో పెట్టే అసభ్యకర పోస్టుల విషయంలో చాలా మంది కుమిలిపోతున్నారు. శాంతి భద్రతలకంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. ఆడబిడ్డలపై అరాచకం చేస్తే.. అదే చివరి రోజు అనిపించేలా పోలీసులు కఠినంగా ఉండాలి. ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి.. ప్రభుత్వం పోలీసులకు అండగా ఉంటుంది." అని సీఎం స్పష్టం చేశారు.

**పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం:** "ఆధునికీకరణలో టెక్నాలజీలో పోలీస్ శాఖ ముందుండాలి. నూతన పాలసీలు తీసుకొచ్చాం. గ్రేహౌండ్స్ ను చాలా పటిష్టంగా తయారు చేశాం. రౌడీయిజం చేయాలనుకున్న వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించాం. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడాలి. నేరాల కట్టడి విషయంలో కఠినంగా వ్యవహరించాలి. శాంతి భద్రతల విషయంలో నేను ఏనాడూ రాజీపడలేదు. అందుకే నా పై నక్సలైట్లు క్లైమోర్ మైన్లతో దాడి చేశారు. మనం చేసే పనులే శాశ్వతం. మంచి పనులు చేస్తున్న పోలీస్ శాఖను అభినందిస్తున్నా. పోలీసుల వైద్య సేవలకు 16 నెలల్లో రూ. 33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ. 23 కోట్లు అందించాం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నాం. ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయించాం. పోలీస్ సోదరులకు ఒక సరెండర్ లీవ్ రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ నియామకాలను పూర్తి చేశాం. శాఖాపరమైన పదోన్నతులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యం కావాలి. దీనికి శాంతి భద్రతలు చాలా ముఖ్యం. విపత్తులు, కరోనా లాంటి మహమ్మారి వంటివి వచ్చినా... ముందుండి ప్రజల కోసం పోలీసులు మొదటి అడుగులు వేశారు. పోలీసులు తమ విధుల కోసం కుటుంబాన్ని సుఖ సంతోషాలను త్యాగం చేస్తున్న పోలీస్ కుటుంబాలకు నమస్కారాలు."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఇంతటి పెద్ద నెట్‌వర్క్ ఎక్కడా ఉండదు. దీన్నిమనం సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం వీళ్లు చేస్తున్న పొదుపునకు మించిన స్థాయిలో మరింతగా పొదుపు చేయించడం.. వారిని వ్యాపారులుగా.. పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం వైపు నుంచి పూర్తి సహకారం అందించాలి. ఇదే సమయంలో డ్వాక్రా, మెప్మా మహిళల్లో ఉన్న టాలెంట్ గుర్తించాలి. డ్వాక్రా సంఘాలు పొదుపు చేసే మొత్తాలను..వాళ్లు బ్యాంకులోన్ల ద్వారా తీసుకునే రుణాలను ఏ విధంగా వినియోగించుకోవచ్చు... వాటిని మరింత సద్వినియోగం ఎలా చేయవచ్చనే అంశంపై గైడ్ చేయడానికి అవసరమైతే ఫండ్ మేనేజర్‌ను ఏర్పాటు చేసుకునే అంశాన్ని కూడా పరిశీలించాలి." అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**స్వయం సహాయక మహిళలకు గంటల్లో బ్యాంకు రుణాలు:** "స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి. గంటల్లోనే రుణాలందిస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు..ఇది అమలు అవుతుందో లేదో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించండి. తీసుకున్న రుణాలతో వ్యాపారం చేసుకునే మహిళలను ప్రోత్సహించండి. వారికి వ్యాపార అవకాశాలు మరింతగా పెరిగేలా డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలి. డ్వాక్రా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ రావాలి. డ్వాక్రా మహిళల్లోని టాలెంట్ గుర్తించడం... స్థానికంగా ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవడం.. టెక్నాలజీని ఉపయోగించుకోవడం వంటి అంశాల ద్వారా డ్వాక్రా మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలని సూచించారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుడ్ బిజినెస్, ఆక్వా, టూరిజం వంటి రంగాల్లో మహిళా ఉత్పత్తులకు ఎలాంటి మార్కెట్ ఉంటుందో



అన్వేషించి...వారికి అవకాశాలు కల్పించాలి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 100 వరకు ప్రొడెక్ట్ క్లస్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం డ్వాక్రా మహిళల తలసరి ఆదాయం రూ. 1,45,000గా ఉంది. ఇది మరింతగా మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఐటీని ప్రమోట్ చేశాను..దాన్ని అందిపుచ్చుకున్న వారు అత్యధిక తలసరి ఆదాయంతో ఉన్నారు. అలాగే డ్వాక్రా సంఘాలను ప్రారంభించాను.. మహిళల్లో సాధికారత తెచ్చే ప్రయత్నం చేశాను. కానీ డ్వాక్రాసంఘాలు ప్రారంభించే నాటికి చాలా మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. అయినా ఆ సంఘాల ద్వారా వారు అభివృద్ధి చెందారు కానీ... వారు పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారస్తులుగా ఎగదాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తోంది. లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే దిశగా అడుగులు వేస్తోంది. డ్వాక్రా మహిళలతో ఎంఎస్ఎంఈలు స్థాపించేలా అధికారులు డ్వాక్రా మహి"ళల అభివృద్ధికి కృషి చేయాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**స్టార్ బక్స్ తరహాలో అరకు కాఫీ-మిల్లెట్ల అవుట్ లెట్లు:** "అరకు కాఫీ-మిల్లెట్లు ఈ రెండింటి కాంబినేషన్లో అవుట్ లెట్లు ఏర్పాటు చేసే ఆలోచన చేయండి. స్టార్ బక్స్ తరహాలో ఈ అవుట్ లెట్ల డిజైనింగ్ ఉండాలి. ఈ మేరకు చర్యలు తీసుకోవాలి. మునగాకుతో ఉత్పత్తులు చేయొచ్చు... మహారాష్ట్ర బ్యాంబూ మిషన్ పాలసీ తెచ్చింది.. దీనిపై అధ్యయనం చేయండి.. డ్వాక్రా మహిళలతో ఈ ఉత్పత్తులు చేయిద్దాం. ఆక్వా రంగంలో రాష్ట్రానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. సీవీడ్ కల్చర్ ప్రమోట్ చేద్దాం. గుర్రపు డెక్కతో ఉత్పత్తులు చేయవచ్చు. అన్నింటిని ఇంటిగ్రేట్ చేసుకుని చేయండి. డ్రోన్లను ఎగరేయడం మొదలుకుని ఎగ్ కార్ట్, ఆక్వా కార్ట్, మిల్లెట్ కార్ట్ వంటివి ప్రయోగాత్మకంగా చేపట్టండి. డ్వాక్రా సంఘాల్లో కూడా పీహెచ్డీ చేసిన మహిళలు ఉన్నారు.. వారిని గుర్తించి.. వారి సేవలను కూడా ఉపయోగించుకోవచ్చు. టూరిజం రంగం హోం స్టేలను ఏర్పాటు చేస్తోంది... వీటిల్లో డ్వాక్రా సంఘాలు వచ్చేలా చూడండి." అని ముఖ్యమంత్రి చెప్పారు.


**మెప్మా-మన మిత్ర యాప్ ఆవిష్కరణ :** సమీక్ష అనంతరం మెప్మా-మన మిత్ర యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా మెప్మాకు సంబంధించిన 8 రకాల సేవలను యాప్‌లో అందుబాటులో ఉంచారు. మెప్మా చేపట్టే కార్యక్రమాలు, కార్యకలాపాలను వివరిస్తూ రూపొందించిన అవని వార్షిక సంచికను ఆవిష్కరించారు. ప్రగ్న్యా యాప్‌ను కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా మెప్మా సభ్యులకు వర్చువల్ ట్రైనింగ్ అందిస్తారు. అలాగే రూ. 1.25 కోట్లను బ్యాంక్ నుంచి రుణం పొంది వ్యాపారం చేస్తున్న మంగళగిరికి చెందిన మహిళను సీఎం అభినందించారు. ఈ మేరకు ఆమెకు చెక్కును అందించారు. ఈ సమీక్షలో మంత్రులు వర్చువల్‌గా నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

సమాజంలో సుఖ శాంతులు ఉంటాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమాజంలో అలజడి ఉంటే పెట్టుబడులు రావు'అని ఏపీలోని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. శాంతి భద్రతల విషయంలో రాజీపడకూడదని ప్రభుత్వం భావిస్తోంది. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతో పరిశ్రమలు, కంపెనీలు వస్తాయి. అదే నమ్మకంతో విశాఖలో గూగుల్ పెట్టుబడులు పెట్టింది. విశాఖలో గూగుల్ పెడుతున్న పెట్టుబడులు దేశంలోనే అతి పెద్ద పెట్టుబడి. 15 బిలియన్ డాలర్లతో ఏఐ డేటా హబ్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది. అప్పుడే ఏపీ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుంది అని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రతీ 50 కి.మీకు సీసీ కెమెరా :** 'ఏపీ పోలీసులు అంటే ఒక బ్రాండ్. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంను అణిచి వేయడంలో ఏపీ పోలీసులు ఎంతో పేరు తెచ్చుకున్నారు. పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. సిద్ధాంతం పేరుతో, ఆధిపత్యం కోసం, డబ్బుల కోసం నేరాలు చేసే వారు ఉన్నారు. ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట పడాలి'అని సీఎం చంద్రబాబునాయుడు పోలీసులకు దిశానిర్దేశం చేశారు.'నేరాల తీరు మారుతోంది. క్రిమినల్స్ అప్ డేట్ అవుతున్నారు. వారి ఆట కట్టించాలంటే పోలీసు శాఖ కూడా అప్డేట్ అయి ఉండాలి. అందుకే సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్... ఇలా టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది'అని సీఎం చంద్రబాబు నాయుడు



పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ప్రతీ 50 మీటర్లకి ఒక సీసీ కెమేరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీస్ యంత్రాంగానికి మూడో కన్నులా పనిచేస్తుంది. ఎవరు ఎక్కడ ఏ తప్పు చేసినా రికార్డెడ్‌గా పట్టుకునే వీలు కలుగుతుంది. టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ, అధునాతన పోలీస్ స్టేషన్లు, ఈగల్ , శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రోన్లతో గంజాయి పంటను గుర్తించి ధ్వంస చేస్తున్నారు. స్మగ్లింగ్‌ను అరికడుతున్నారు. అడవుల్లో డ్రోన్లు ఎగరేసి ఎర్ర చందనం దొంగలను కట్టడి చేస్తున్నారు. ఈ విషయంలో పోలీసు శాఖకు అభినందనలు. డబ్బుల కోసం రౌడీయిజం చేసే ముఠాలుగా మారుతున్న వారిని కట్టడి చేయాలి. తప్పు చేసే వారికి పోలీస్ అంటే భయం ఉండాలి. అప్పుడే నేరాలు తగ్గుతాయి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గ్రేహౌండ్స్‌ను చాలా పటిష్టంగా తయారు చేశాం 'ఆధునికీకరణలో టెక్నాలజీలో పోలీస్ శాఖ ముందుండాలి. నూతన పాలసీలు తీసుకొచ్చాం. గ్రేహౌండ్స్‌ను చాలా పటిష్టంగా తయారు చేశాం. రౌడీయిజం చేయాలనుకున్నవారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించాం. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'నేరాల కట్టడి విషయంలో కఠినంగా వ్యవహరించాలి. శాంతి భద్రతల విషయంలో నేను ఏనాడూ రాజీపడలేదు. అందుకే నా పై నక్సలైట్లు క్లైమోర్ మైన్లతో దాడి చేశారు. మనం చేసే పనులే శాశ్వతం. మంచి పనులు చేస్తున్న పోలీస్ శాఖకు నా అభినందనలు' అని చంద్రబాబు నాయుడు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులను ఆకర్షించి గ్లోబల్ సిటీగా మార్చడంలో జైటర్ కృషిని మంత్రి లోకేష్ ప్రశంసించారు. ప్రజారవాణా, గ్రీన్ స్పేసెస్ ను అభివృద్ధి చేయడంలో చొరవ చూపిన జైటర్, పారమట్టా స్క్వేర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. గత 20 సంవత్సరాలుగా లోకల్ గవర్నెన్స్, కమ్యూనిటీ డెవలప్ మెంట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సార్టప్ స్టేట్ గా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన నగరాల అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం హారిస్ పార్కులో లిటిల్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన రివర్ సైడ్ ఫుడ్ కోర్టును సందర్శించారు.

## 'పేకాట పై డిప్యూటీ సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

పేకాట క్లబ్బుల నిర్వహణపై ఆ ఫిర్యాదుల్లో తెలిపారు. కొందరు పెద్దలు పేకాట కేంద్రాలను నిర్వహిస్తూ, నెలవారి మామూళ్లను అధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు, పోలీసు అధికారులకు దీనిపై ఉన్న సమాచారం తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై ఆరా తీశారు. ఒకవేళ పోలీసు అధికారుల దృష్టికి వచ్చిన వివరాలు, దానిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర డీజీపీకి స్పష్టం చేశారు.

## పేద విద్యార్థులకు కేంద్రం అండ... ఏటా రూ.12,000

(మొదటి పేజీ తరువాయి)



ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ప్రతి సంవత్సరం రూ. 12,000 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది.

ఈ పథకం ప్రధాన ఉద్దేశం పేదల ప్రతిభావంతులైన విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా ఉన్నత విద్య కొనసాగించేలా చేయడమే. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రాష్ట్రాల ద్వారా అమలు చేస్తోంది. ప్రభుత్వ లేదా ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులకే ఈ సౌకర్యం లభిస్తుంది.

**పరీక్ష విధానం :** ఎన్ఎంఎంఎస్ పరీక్షను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. మెంటల్ అబిలిటీ టెస్ట్ (మానసిక సామర్థ్యా పరీక్ష)లో అభ్యర్థుల రీజనింగ్, లాజికల్ ఆలోచనశక్తిని అంచనా వేస్తారు. స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో 7వ, 8వ తరగతి సబ్జెక్టులైన జనరల్ సైన్స్, సోషల్, గణితంపై ప్రశ్నలు అడుగుతారు. ప్రతి విభాగం 90 మార్కులకు, మొత్తం 180 మార్కుల పరీక్ష మూడు గంటలపాటు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఏకకాలంలో నిర్వహిస్తారు.

**అర్హ తలు :** ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్, మండల పరిషత్తు, ఎయిడెడ్, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు చెల్లుతాయి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలలోపు ఉండాలి.

**దరఖాస్తు విధానం :** www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు లింక్ అందుబాటులో ఉంది. ప్రభుత్వం చివరి తేదీని ఈ నెల 25 వరకు పొడిగించింది. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 50. దరఖాస్తు సమయంలో ఏడో తరగతి మార్కుల మెమో, ఆదాయం, కుల ధ్రువపత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు అవసరం.

**ఉపకార వేతనం అందే విధానం :** పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను రాష్ట్ర విద్యా శాఖ కేంద్రానికి పంపిస్తుంది. ఆమోదం తర్వాత విద్యార్థుల ఖాతాల్లో ప్రతి సంవత్సరం రూ. 12,000 చొప్పున జమ అవుతుంది. ఈ వేతనం ప్రభుత్వ లేదా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకే వర్తిస్తుంది. ఇంటర్మీడియెట్ స్థాయిలో కూడా చదువు కొనసాగిస్తేనే వేతనం కొనసాగుతుంది.

**విద్యాశాఖ చొరవ :** ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. జిల్లాల వారీగా అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

**విద్యావేత్తల అభిప్రాయం :** ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఉన్నత విద్యలోకి అడుగుపెట్టే బంగారు వేదికగా మారిందని విద్యావేత్తలు పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ఆర్థిక ప్రోత్సాహం అందించడం ఈ పథకం ప్రత్యేకత అని, మరింత ప్రచారం, శిక్షణలు కల్పిస్తే జిల్లాల వారీగా అర్హుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది విధులు ఖరారు..!

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది విధులపైన కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే సమయంలో అనేక పనులు తమకు కేటాయిస్తున్నారంటూ ఉద్యోగులు వాపోతున్నారు.

దీంతో, దీని పైన స్పష్టత ఇస్తూ ప్రభుత్వం వారికి జాబ్ ఛార్జ్ ఖరారు చేసింది. ఇదే సమయంలో పనుల ప్రాధాన్యతల పైన క్లారిటీ ఇచ్చింది. ఏడు అంశాలతో పనులు కేటాయించిన ప్రభుత్వం.. జాబ్ ఛార్ట్ అమలు బాధ్యతలను అధికారులకు అప్పగించింది.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు వారికి నిర్దేశించిన సాధారణ జాబ్‌చార్ట్‌తో పాటు ఆయా శాఖలకు సంబంధించిన పనుల పై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పౌరులకు ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు, సేవలు చేర్చాలని సూచించింది. అదే విధంగా సచివాలయాలకు వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించే లా చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. విపత్తులు సంభవించినప్పుడు సిబ్బంది హాజరు కావాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం అప్పగించే బాధ్యతలను ఎప్పటికప్పుడు నెరవేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిబ్బందికి ఒకేసారి ఎక్కువ పనులు చేయాల్సి వస్తే, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో చర్చించి, కలెక్టర్ అనుమతితో పనుల ప్రాధాన్యతను నిర్ణయిస్తారని పేర్కొంది.

**తిరుపతికి మరో వందేభారత్, రూట్..షెడ్యూల్- విశాఖ కేంద్రంగా ఇక..!!**

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది.. గ్రామ, వార్డు స్థాయి అభివృద్ధి పనుల్లో చురుగ్గా పాల్గొనాల ని సూచించింది. సచివాలయ సిబ్బంది గ్రామ, వార్డు అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫిర్యాదుల పరిష్కారం కోసం సిబ్బంది నిరంతరంగా పర్యవేక్షణ చేయాలని పేర్కొంది. అదే సమయంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే దివ్యాంగ సిబ్బందికి సంబంధించి క్లారిటీ ఇచ్చారు. దివ్యాంగ సిబ్బందికి ఇంటింటి సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో వారికి అనువైన పని వాతావరణం కల్పించాలని.. అలాగే వారి సమస్యల్ని పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ సమయానుసారం వారికి అప్పగించే ఏ పనులైనా ఆదేశాలకు అనుగుణంగా నిర్వర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

## మొదలైన కార్తీక మాస దీపోత్సవం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** లయకారుడైన శివానుగ్రహం కోసం ప్రతిరోజు ఆలయాలకు,వెళ్ళిపూజలు చేసివారికి సైతం, కార్తీక మాసంలోనె, శివానుగ్రహానికి ప్రత్యేక ప్రాధాన్యత అనే నమ్మకం అనాదిగా కొనసాగుతుంది. ఈనెల 22,నుండి కార్తీకమాసం ఆరంభ సందర్భంగా, పట్టణ పరిసర గ్రామాల శివాలయాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతినిత్యం తెల్లవారు జాము నుండే శివాలయాల్లో, కార్తీక దీపాలు కన్నుల పండుగా దర్శనమివ్వనున్నాయి. ఆధ్యాత్మిక ఆనందానికి ప్రతీక కార్తీకమసం. భక్త సులభుడైన పరమేశ్వరుని అనుగ్రహం కోసం, అభిషేక పూజలు,అత్యంత భక్తి శ్రద్దలతొ నిర్వహించే ఆద్యాత్మిక ఆచారం, భక్తజనులను పరవశమందించే అంశం. పట్టణంలో ప్రధానంగా, గంగానమ్మ పేటలో వేంచేసియున్న, శ్రీ పర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వర స్వామి ఆలయం విశిష్టతను ఆలయం. పరసురామ ప్రతిష్ఠిత శివాలయంగా ప్రతీతి. ఇదే ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ట లో,తెనాలి రామకృష్ణుడి స్వయంగా పాల్గొన్న ఉదంతం. ఇలా ఎన్నో ప్రత్యేకతలున్న రామేశ్వరాయం. ప్రజాబాహూళ్యంలో పాతశివాలయంగా, భక్తుల అభీష్టాలు నెరవేర్చే ఆలయంగా పరిడవిల్లుతుంది. ఈకార్తీక మాసంలో భక్తుల సౌకర్యంకోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఇఒ రమణకుమారి తెలిపారు. తెల్లవారుజామున మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించే,ఆలయ ప్రాంగణంలో, మహిళా భక్తులు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని కోరారు. అదేవిధంగా కార్తీక మాసంలొ ప్రతి సోమవారం ఆలయం ఉదయం 5,గంటల నుండి, రాత్రి 9గంటల వరకు, భక్తులు అభిషేకములు జరిపించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.అదే విధంగా మారీస్ పేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయం, రామలింగేశ్వరపేటలోని దుర్గా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం. చినరావూరులోని సోమేశ్వర స్వామి వారి ఆలయం, అదేవిధంగా మండలంలోని నందివెలుగు లోని అగస్తేశ్వర స్వామి ఆలయం, కార్తీకమాస శోభతో, పంచాక్షరీ మంత్ర పారాయణతొ ఆధ్యాత్మిక వికాసకేంద్రాలుగా శైవాలయాలు అలరారనున్నవి.

## పోలీసు అమర వీరులకు సెల్యూట్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాస్వామ్య పరిరక్షణే పరమావధిగా, సమాజ శ్రేయస్సే ఊపిరిగా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించే పోలీసు అమర వీరుల త్యాగం చిరస్మరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు అమవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే నసీర్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రతి రోజూ ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే, పోలీసులు తాము నిద్రలేని రాత్రులు గడిపి తమను రక్షిస్తుంటారని తెలిపారు. అసాంఘిక కార్యక్రలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రతినిత్యం విధి నిర్వహణలో తలమునకలవుతారని స్పష్టం చేశారు. కుటుంబానికి దూరం సమాజం కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసుల ఆత్మగౌరవాన్నికాపాడుతుననామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాల విక్రయాలు పెరిగాయని, దీంతో నేరాలకు అడ్డు ఉండేదని కాదని చెప్పారు. ప్రస్తుతం ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న పోలీసు వారికి ఈ సందర్భంగా సెల్యూట్ చెప్పారు.

## సీపీఐ ఏపీ కార్యదర్శిగా ఈశ్వరయ్య



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన జి. ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటించారు. సీపీఐ ఏపీ నూతన కౌన్సిల్ 102 మందితో ఎన్నికవ్వగా.. 33మందిని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కాగా ఆగస్టులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యదర్శి ఎన్నిక జరగాల్సి ఉండగా వాయిదా వేశారు. జాతీయ మహాసభలు ముగిసిన తర్వాత రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకుంటామని సీపీఐ అగ్రనాయకత్వం అప్పుడు ప్రకటించింది. ప్రస్తుతం జాతీయ మహాసభలు ముగియడంతో రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకున్నారు.

# మునగసాగుకు ప్రభుత్వం భరోసా



- **రూ.1 49 లక్షలతో ప్రోత్సాహకం**
- **వినూత్న ప్రణాళికను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతాంగసంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే ఏపీలోని రైతులకు అన్నదాత సుఖీభవ, రైతుభరోసా వంటి పథకాలను అందించడంతోపాటు, వ్యవసాయంలో నూతన పంటలను సాగు చేసేందుకు వారికి కావలసిన ప్రోత్సాహకాలను అందిస్తోంది.

ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్లో మునగపంట సాగుచేసే రైతులను ప్రోత్సహించడానికి కొత్త ప్రణాళికను సిద్ధం చేసిన ఏపీ సర్కార్ డ్వాక్రా సంఘాలలోని మహిళా రైతులను ఈ పథకం అమలు చేయడానికి ఎంచుకుంది.

**మునగ పంట సాగుకు వినూత్న ప్రణాళిక :** ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే మునగ పంటను సాగు చేసే ఆర్థిక వనరుగా మార్చడం లక్ష్యంగా వినూత్న ప్రణాళికను సిద్ధం చేసింది. 2025- 2026 ఆర్థిక సంవత్సరంలో 12 జిల్లాలను మునగ పంటను సాగు చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, ఆ తర్వాత ఈ పథకాన్ని రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించి తద్వారా ఆదాయాన్ని, ఆర్థిక భరోసాను కల్పించాలని ఏపీ సర్కార్ నిర్ణయించింది.

**మునగసాగు చేసే వారికి ఆర్థిక భరోసా:** ఉపాధి హామీ పథకం కింద రెండేళ్లపాటు మునగ సాగు చేసే మహిళా రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 2,177 మంది రైతులు 1814 ఎకరాలలో మునగ సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వీరికి ఉపాధి హామీ పథకం కింద రెండేళ్లపాటు ఒక లక్షల 49 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ప్రభుత్వం ప్రోత్సహించనుంది.

**మునగ రైతులకు ప్రోత్సాహకం :** 25 సెంట్లు నుండి ఒక హెక్టార్ వరకు సాగు చేసే రైతులకు ఈ ప్రోత్సాహం వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తమిళనాడు రాష్ట్రంలోని పెరియకులం ఉద్యాన విశ్వవిద్యాలయం సిఫార్సు చేసిన పి కే ఎం రకం మునగ విత్తన నాణ్యతను పరిశీలించి సెర్ప్ అధికారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులకు సూచిస్తున్నారు. ఎకరాకు నాలుగు వేల విత్తనాలను నాటాలని వాటిని కొనుగోలు చేసి విత్తడం ద్వారా మంచి దిగుబడి వస్తుందని సూచిస్తున్నారు.

ఎకరానికి నాలుగు లక్షలకు పైగా ఆదాయం

ఇక ఇలా చేసే మునగ సాగుకు ఉపాధిహామీ పథకం కింద గుంతలు తగ్గడానికి విత్తనాలు నాటడానికి నీరు పెట్టి మొక్కలను పర్యవేక్షించడానికి నిధులను చెల్లిస్తారు. కోతకు వచ్చే ఈ మునగాకు పంట ద్వారా ఎకరానికి ఏడాదికి నాలుగు లక్షల 50 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఒక్కసారి నాటితే ఐదేళ్ళ పాటు దిగుబడి

ఒకసారి నాటితే ఐదేళ్లపాటు దిగుబడి వస్తుందని డ్వాక్రా మహిళలు దీనిని యూనిట్ గా తీసుకొని మునగ చేయడం ప్రారంభిస్తే పంట ఉత్పత్తిని అమ్మడానికి అధికారులు చొరవ తీసుకుంటున్నట్టు తెలుపుతున్నారు. ఎక్కువ మొత్తంలో మునగను కొనుగోలు చేసేలాగా కొన్ని ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని తద్వారా ఆర్థిక భరోసా కల్పించనున్నారు. ఎకరంలో మునగ తోట సాగుచేసే రైతులకు రెండేళ్లలో ఒక లక్ష 49వేల రూపాయలను ఉపాధి హామీ పథకం కింద ఇవ్వనున్నారు.

ఈ పథకంతో లబ్ది పొందాలంటే ఇలా చెయ్యండి

మరి ఇంకెందుకు ఆలస్యం ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే రైతులు తమ భూమి పాసుబుక్ ను, బ్యాంక్ పాస్ బుక్, ఉపాధిహామీ జాబ్ కార్డు, జిరాక్స్ కాపీలను ఎంపీడీవో ఆఫీసులో కానీ మండల ఉపాధి హామీ కార్యాలయం లో గాని అందజేసి దరఖాస్తు చేసుకుంటే అర్హులైన రైతులకు అధికారులు సహాయం చేస్తారు.

# అక్టోబర్ 27 నుంచి.. రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు ముఖ్య గమనిక. అక్టోబర్ 27 నుంచి ఏపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను మొదలుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైస్ మిల్లర్లకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అందరినీ కలుపుకుని పోతున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన రూ.1674 కోట్లు బకాయిలు చెల్లించామని.. రైస్ మిల్లర్లకు చెల్లించాల్సిన763 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు.

గతేడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్న మంత్రి నాదెండ్ల మనోహర్.. ఈ ఏడాది 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మరోవైపు వాట్సప్ ద్వారా ధాన్యం అమ్మకాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వాట్సప్‌లో హాయ్ అని పంపగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే వారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోందని గుర్తు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తోడుగా నిలవాలని కోరారు.

మరోవైపు గతేడాది అనుభవాలతో తేమ శాతం కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, రవాణా సదుపాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ రైస్ మిల్లర్లకు సూచించారు. అక్టోబర్ 27 నుంచి.. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ సీజన్‌లో 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటుగా మొత్తం 10,700 సిబ్బందితో ధాన్యం సేకరణ చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. ఈ సందర్భంగా ఏపీ పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం సేకరణ వివరించారు.

# ఆర్టీసీలో నాలుగు క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఏపీ ప్రభుత్వం పండుగ వేళ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఉద్యోగులు ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న నిర్ణయం వెలువరించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తోంది. ఈ పథకం సక్సెస్ లో ఆర్టీసీ సిబ్బంది పాత్రను సీఎం చంద్రబాబు అభినందించారు. కాగా, ఉద్యోగులు తమ పదోన్నతుల పైన ప్రభుత్వంతో చర్చలు జరిపారు. తాజాగా సీఎం హామీ మేరకు నాలుగు కేడర్ల ఉద్యోగులకు ప్రమోషన్లతో పాటుగా..పనిష్మెంట్ల నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి దీపావళి బొనాంజ ప్రకటించింది. ఆరేళ్లుగా ఉద్యోగులు ఎదురు చూస్తున్న పదోన్నతులకు లైన్ క్లియర్ అయింది. నాలుగు కేడర్ల ఉద్యోగులకు పదోన్నతుల అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం చంద్రబాబు తాజా సమావేశం సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల ఫైల్?క్లియర్ చేస్తామని ప్రకటించారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది.

మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టిజన్స్ కేడర్‌లలోని ఉద్యోగులు, పనిష్మెంట్లు, పెనాల్టీలు, క్రమశిక్షణ చర్యలు, ఛార్జెస్ ఉన్నప్పటికీ వాటితో సంబంధం లేకుండా పదోన్నతులు పొందేందుకు అర్హులుగా పేర్కొంది. అయితే వారంతా కూడా గతంలో ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు ఈ విధమైన మినహాయింపు ఉండేది. తాజా ఉత్తర్వుల్లో వీరికి సంబంధించి స్పష్టత ఇచ్చింది.

ఇక, 2020లో ప్రభుత్వంలో విలీనం అయినప్పటి నుంచి ఇతర శాఖల ఉద్యోగుల నిబంధనలు వీరికీ వర్తించాయి. వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. బీ ఆర్టీసీలో ఆరు విభాగాలు ఉన్నాయి. అందులో ప్రస్తుతం రెండు విభాగాల్లోని సిబ్బందికే పదోన్నతులకు అవకాశం కల్పించగా..తాజాగా ఆరు విభాగాల్లోని ఉద్యోగులు అందరికీ పదోన్నతులు దక్కేలా చొరవ చూపాలని ఉద్యోగ సంఘాలు కోరాయి.

లేకపోతే చాలా మందికి అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మేరకు ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న నాలుగు డీఏల్లో ఒకటి నవంబర్ 1న విడుదల చేస్తామని దీపావళి సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అదే విధంగా ఆర్టీసీ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు పదోన్నతుల ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# నీటి పథకాల వివరాలు సమర్పించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** జిల్లాలో రక్షిత నీటి పథకాల వివరాలను పూర్తి స్థాయిలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, డి.ఆర్.డి.ఏ కార్యక్రమాలపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ప్రతి నీటి పథకం వసతులు, ఫిల్టర్ రకము, ఎన్ని ఆవాసాలకు సరఫరా చేస్తున్నది, పథకం వివరాలను సవివరంగా సమర్పించాలన్నారు. జిల్లాలో ఉన్న 234 నీటి పథకాల వారీగా డేటాను అందించాలని చెప్పారు. నీటి పథకాలు శుభ్రపరిచిన తేదీలు, శుభ్రపరిచే విధానాన్ని కూడా పొందుపరచాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నుండి జిల్లా తాగునీటికి చేస్తున్న విషయాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లాలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు కార్యాచరణను సమర్పించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన గ్రామాలు లక్ష్యంగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని ఆదేశించారు. చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలు మరింత సమర్ధవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

డి.ఆర్.డి.ఏ క్రింద బ్యాంక్ లింకేజి, ఉన్నతి విభాగాలలో ప్రగతి రావాలన్నారు. నూతన యూనిట్లను నెలకొల్పడంలో దృష్టి కేంద్రీకరించాలని, మహిళలను పారిశ్రామిక రంగంలో ముందంజ వేయుటకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని ఆదేశించారు.

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద వివిధ పనులను చేపడుతున్నామని వివరించారు.

జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు 216 ఉండగా వాటిలో 214 కేంద్రాలు పని చేస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లను ఆరు ప్రదేశాల్లో పెట్టుటకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.

డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి మాట్లాడుతూ జీవనోపాధులపై ఎక్కువ దృష్టి సారిస్తున్నామన్నారు. కొన్ని రైల్వే స్టేషన్ లలో దుకాణాలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. పొన్నూరులో చిరు ధాన్యాల క్లస్టర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. తాడికొండ ప్రాంతంలో పచ్చళ్ళ తయారీకి కామన్ ఫెసిలిటీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించామని అన్నారు. మునగ పంటను ఐదు ప్రాంతాల్లో సాగు చేయుటకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు.

ఈ సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీఏ బకాయిల గందరగోళానికి చెక్ పెట్టిన సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** డీఏ బకాయిల చెల్లింపు విషయంలో ఏర్పడిన గందరగోళాన్ని అదుపులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏపీ జేఏసీ అమరావతి కృతజ్ఞతలు తెలిపింది.

దీపావళి కానుకగా ఉద్యోగులకు ఓ డీఏ ప్రకటించి, దానికి సంబంధించిన జీవోను పండుగ రోజు విడుదలచేసిన ఆర్థికశాఖ అధికారులు ఉద్యోగుల్లో తీవ్ర అభిప్రాయ భేదాలు, గందరగోళాన్ని సృష్టించారు. సోమవారం విడుదలైన ఉత్తర్వుల్లో సర్వీసులో ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో, పెన్షనర్లకు 12 విడతల్లో బకాయిలు చెల్లిస్తామని పేర్కొనడం ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కలిగించింది.

ఈ నేపథ్యంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. అధికారులు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సదరు జీవిత ఆదేశాల్లో సవరణలు చేయాలని సూచించారు.

దీంతో ప్రభుత్వం కొత్తగా సవరణలతో కూడిన డీఏ జీవో నెం.62ను మంగళవారం విడుదల చేసింది. ఈ సవరణ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు ముగ్గురికీ సమానంగా మూడు విడతల్లో (2026 ఆగస్టు, నవంబర్, 2027 ఫిబ్రవరి) బకాయిలు చెల్లించబడతాయి.

ఈ సత్వర నిర్ణయంతో ఉద్యోగ వర్గాల్లో నిశ్చింత నెలకొన్నదని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమస్యకు తక్షణ పరిష్కారం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తమ రాష్ట్రకమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు అన్నారు.

# మూడు విడతల్లో డీఏ బకాయిల చెల్లింపుకు స్పష్టమైన జీవో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** డీఏ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం సవరించిన ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగ వర్గాల్లో ఊరట నెలకొన్నట్లు గుంటూరు జిల్లా ఎన్‌జీజీఓ అసోసియేషన్ అధ్యక్షులు ఘంటశాల శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు జారీ చేసిన జీవో నంబర్లు 60, 61 పట్ల నెలకొన్న అసంతృప్తిని సర్దుబాటు చేయడంలో ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్ చేసిన కృషి ఫలించిందని ఆయన అన్నారు.

మొదట విడుదలైన జీవోల్లో సేవలోని ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత, పెన్షనర్లకు 12 విడతల్లో బకాయిలు చెల్లిస్తామని పేర్కొనడం ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ముఖ్యమంత్రి కార్యాలయాలు, ఆర్థికశాఖ ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించారు. డీఏ బకాయిలను రిటైర్మెంట్ తర్వాత చెల్లించడం సరైంది కాదని వివరణాత్మకంగా చెప్పడంతో అధికారులు ఆయన అభిప్రాయానికి ఏకీభవించారు.

విద్యాసాగర్ నేతృత్వంలోని ఏపీ జేఏసీ నిరంతర ఒత్తిడి దృష్ట్యా ప్రభుత్వం జీవోల సవరణకు ఏర్పాట్లు చేసింది. ఫలితంగా మంగళవారం ఫైనాన్స్ శాఖ డీఏ జీవో నంబర్ 62ను సవరించి విడుదల చేసింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు ముగ్గురికీ సమానంగా మూడు విడతల్లో (2026 ఆగస్టు, నవంబర్, 2027 ఫిబ్రవరి) డీఏ బకాయిలు చెల్లించనున్నట్లు ప్రకటించింది.

ఉద్యోగుల సమస్యపై త్వరితంగా స్పందించి సరిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏపీ జేఏసీ, ఎన్‌జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా ఎన్‌జీజీఓ అసోసియేషన్ అధ్యక్షులు ఘంటశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సత్వర స్పందనతో, సీఎంఓ, ఆర్థిక శాఖ అధికారుల తోడ్పాటుతో , తమ రాష్ట్ర ఆధ్యక్షులు విద్యాసాగర్ కృషితో సాధ్యమైన పరిష్కారం ఉద్యోగులకు ఉపశమనం కలిగించిందన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అండగా భీమవరం డిఎస్పి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : అసాంఘిక వ్యవహారాలకు భీమవరం డిఎస్పి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలని, సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చకుండా చూడాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పిని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అంతేకాకుండా ఆ డిఎస్పి వ్యవహారశైలిపై తక్షణమే నివేదిక పంపాలన్నారు. భీమవరం డిఎస్పి జయసూర్య వ్యవహారాలపై తరచూ పెద్దయెత్తున ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో పవన్‌కల్యాణ్ మంగళవారం ఎస్పికి ఫోన్ చేసి మాట్లాడారు. భీమవరం డిఎస్పి పరిధిలో పేకాట శిబిరాలు పెరిగాయని, సివిల్ తగాదాల్లో పోలీసులు, ఆయన జోక్యం చేసుకుంటున్నారని, కూటమి నేతల పేర్లు వాడుకుంటున్నారనే ఫిర్యాదులు తమ కార్యాలయానికి అందుతున్నట్లు తెలిపారు. డిఎస్పిపై వచ్చిన ఆరోపణలను హోంమంత్రి, డిజిపికి తెలపాలని తన కార్యాలయ అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు.

## రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో చీకట్లను చెరిపేసి సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిం చారు. కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కాలని, సాంస్కృతిక, కళా వైభవం విలసిల్లాలని, ఆంధ్రప్రదేశ్ లో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించారు. పర్యావరణహితంగా దీపావళిని ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## కుడిచేటి మురళి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన దామోదర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**

తిరుపతి జిల్లా, శ్రీ కాళహస్తి నియోజకవర్గం చర్లపాలెం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళి కొంతకాలం అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. వారికి పార్థివదేహాన్నికీ శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ తలపా దామోదర్ రెడ్డి నివాళులు అర్పించడం జరిగింది. వారు పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేశారని, వారు లేకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారితోపాటు తిరుపతి జిల్లా యువజన అధ్యక్షులు సీతారాం, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నాగరాజు శంకర్ తదితరులు నివాళులు అర్పించారు.

## నూతన ఎస్ఐగా హరి ప్రసాద్ బాధ్యతలు

**బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండల ఎస్ఐగా హరి ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈయన తిరుపతి ఎస్పీ కార్యాల యంలో ఎస్సైగా పనిచేస్తూ, బదిలీపై బుచ్చినాయుడు కండ్రిక మండల ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణ తనకు ముఖ్యమని, మండలంలో గుట్కా గంజాయి డ్రగ్స్ విక్రయాలు ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆపద సమయంలో ఉన్నపుడు డయల్ 100 నెంబర్ కీ ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో బెల్ట్ షాప్ లు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతామనీ అన్నారు.తాను మండలంలో ప్రజలకి అందుబాటలో ఉంటానన్ని చట్ట పరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు నేరుగా తనను కలిసి సమాచారం ఇవ్వవచ్చునని అన్నారు.

## మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మరణం తీరని లోటు

### షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్

**విజయవాడ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



తెలుగు రాష్ట్రాల ప్రఖ్యాత మతపండితుడు, జమియత్ ఉలేమా-ఎ-హింద్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ ఇక లేరని తెలిసి హృదయం కలిచివేసిందని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ మేరకు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మరణం మతపరమైన, సామాజిక, విద్యా రంగాలకు తీరని లోటని అన్నారు. ఆయన జీవితం అంతా మత సేవ, విద్యా ప్రాచుర్యం, మరియు మానవతా విలువల ప్రోత్సాహానికి అంకితం అయిందని అన్నారు. శాంతి, సహనం, ఐక్యత వంటి విలువలను సమాజంలో వ్యాప్తి చేసిన గౌరవనీయ వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. ముస్లిం సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసిన గొప్ప నాయకుడని అన్నారు. మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్‌తో తనకు వ్యక్తిగత అనుబంధం కూడా ఉందని, ఆయన సౌమ్యత, వినయం, మరియు సమాజం పట్ల ఉన్న నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అల్లాహ్ తాలా ఆయన ఆత్మకు జన్నత్ అల్ ఫిర్దౌస్ లో ఉన్నత స్థానం ప్రసాదించాలని, ఆయన కుటుంబ సభ్యులకు, శిష్యులకు, అభిమానులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ఓర్పు ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను అని తెలిపారు.

## తెలుగు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు: వైఎస్ జగన్

**గుంటూరు, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



దీపావళిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారాయన.'ప్రతి ఇంటా దీపాలు వెలగాలి. ఆనందాలు వెల్లువలా పొంగాలి'.వెలుగుల పండుగ దీపావళి తెలుగువారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని కోరుకుంటున్నాను. దీపావళి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు. దీపావళి అంటేనే కాంతి, వెలుగుతో పాటు, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి .. సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ. ఈ దీపావళి పండుగ, ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలి. తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో విరాజిల్లాలని కోరుకుంటున్నా' అని వైఎస్ జగన్ అభిలాషించారు.

# మహిళలు,గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





### రక్తహీనత అధికమించేందుకు కృషి చేయాలి

- మహిళలు పోషక ఆహారం తీసుకోవాలి
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి
- లీ ఫార్మా సంస్థల అధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

**విశాఖపట్నం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**

రక్తహీనతను అధికమించేందుకు మహిళలు, గర్భిణిలు,బాలింతలు జాగ్రత్తలు తీసుకోని,పౌష్టిక ఆహారం తీసుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. లీ ఫార్మా ఢ లీ హెల్త్ డొమైన్ 'స్మూత్‌వాక్' ప్రాజెక్ట్ సంయుక్తంగా మాతృ ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రోత్సహించేందుకు పత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు న్యూట్రిషన్ కనెక్ట్ ప్రోగ్రామ్ రక్తహీనత పరీక్ష ఢ పోషకాహారంపై దృష్టి పెట్టె విధంగా లీ ఫార్మా మరియు లీ హెల్త్ డొమైన్, దీక్షా మహిళా సంక్షేమ సం ఘం మరి యు మండలి ఎన్ జి ఓతో కలిసి ముంగివా నివలస, సాలూరు కమ్యూనిటీలో సమగ్ర ఆరోగ్య కార్యక్రమం ద్వారా మాతృ ఆరోగ్యాన్నికి కృషి చేస్తున్నా యి. వైద్య శిబిరంలో గర్భిణీ మరియు పాలిచ్చే బాలింతలైన సుమారు 100 మంది మహిళలకు రక్తహీ నత పరీక్షలు నిర్వహించారు. తల్లి మరియు బిడ్డ ఇద్దరికీ కీలకమైన పోషకాహార లోపాలను గుర్తిం చడానికి మరియు పరిష్కరించడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి వివరిం చారు. శరీరంలోని ఇనుము ఢ కాల్షియం పెంపోందించుకోనేందుకు పలు సూచనలు చేశారు. మహిళలకు నిర్వహించిన వంటల పోటీలు? ఎంతగానో అకట్టుకున్నాయి. రక్తహీనతను ఎదుర్కోవడానికి మరియు గర్భిణీ, పాలిచ్చే మహిళల ఎముకల ఆరోగ్యానికి తోడ్పడే కీలక పోషకాలైన ఇనుము మరియు కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తయారు చేయడం ఈ పోటీ యొక్క ముఖ్య ఉద్యేశమని ఆళ్ళ లీలారాణి చెప్పారు.? పోటీల్లో మహిళలు రుచిక రమైన, పోషకాలు సమృద్ధిగా ఉన్న వంటకాలను ప్రదర్శించడమే కాకుండా, తమ వంటకాలలోని పోషక వాస్తవాలు మరియు ఆరోగ్య ప్రయోజనాలను వివరిం చారు. ఈ సామూహిక కృషి ఆరోగ్యం మరియు విద్య పట్ల బలమైన కమ్యూనిటీ నిబద్ధతను నొక్కి చెప్పింది, ఈ కార్యక్రమాన్ని ప్రయోజనకరమైన మాతృ పోషణ గురించి ఒక ఆచరణాత్మక, ప్రత్యక్ష అభ్యాస అనుభవం గా మారుతుందన్నారు. ముఖ్యమైన ఆరోగ్య పరీక్షను ఆచరణాత్మకమైన, కమ్యూనిటీ నేతృత్వంలోని విద్యతో విజయవంతంగా మిళితం చేసి, తద్వారా ఈ ప్రాంతంలోని తల్లుల శ్రేయస్సుకు సంస్థలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి , క్యాంప్ కోఆర్డినేటర్ సరోజిని , న్యూట్రిషనిస్ట్ మాధురి, భాగ్య లత, లీ ఫార్మా బృందం మరియు దీక్షా మహిళా సంక్షేమ సంఘం, మండలి హెడ్ శాంతి మరియు ఎఫ్‌పిఓ బృందం తదితరులు పాల్గొన్నారు.

# 'ఒక్క డీఏ ప్రకటించి పండగ చేసుకోమంటున్నారు'

**కాకినాడ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



ఏపీ ప్రభుత్వ ఉద్యోగులను డీఏ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశారని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. ఉద్యోగులకు డీఏ పేరుతో ప్రచారం సాగిందని, అయితే చివరకు ఒక్క డీఏని ప్రకటించి పండుగ చేసుకోమం టున్నారని కురసాల మండిపడ్డారు. 'ఉద్యోగులను కూడా చంద్రబాబు మోసం చేశారు. ఒక్క డిఎ ప్రకటించారు. దీంతో పండుగ చేసుకోమంటు న్నారు. లెక్కప్ర కారం నాలుగు డీఏలు ఇవ్వాలి,. ఒక్కసారి క్షేత్ర స్థాయిలోకి వచ్చి ఉద్యోగులతో మాట్లాడితే తెలుస్తోంది. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో మోసం చేసి ముంచేశాడు. ఫీజు రియింబర్మెంట్ చెల్లించకుండా విద్యార్థులను మోసం చేశాడు. వైఎస్ జగన్ తీసుకువచ్చిన నాడు-నేడును చంద్రబాబు నీరుగార్చేశారు. వారం రోజులుగా ఆరోగ్య శ్రీ సేవలను బంద్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్ని ప్రైవేటీకరణ చేస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేస్తున్నా...వారితో చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావాడం లేదు. చంద్రబాబు మారేదేమో అని ఉద్యోగులు అనుకున్నారు. ఉద్యోగుల డిఎ విషయంలో పెద్ద హైడ్రామా చేసే ప్రభుత్వం ఏదీ ఉండదేమో.. 16 నెలల్లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులకు మేలు చేసే ఒక్క నిర్ణయం తీసుకోలేదు. మసిబూసి మారేడు కాయ చేసి రాష్ట్రంలో ఏదో గొప్పగా జరిగిపోతుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఓపిఎస్ నే అమలు చేస్తానని చంద్రబాబు గతంలో చెప్పారు. ఇప్పుడు ఈ విషయం సుప్రీంకోర్టు లో ఉందంటున్నారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఏలాంటి అలవెన్సులు, బకాయిలు చెల్లించారు. పెన్షనర్ల కోసం ఒక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు.. ఆ కార్పోరేషన్ ఎక్కడ ఏర్పాటు చేశారు. ఉద్యోగ.ఉపాధ్య వర్గాలు ఆగ్రహంగా ఉన్నాయని... ఉద్యోగ సంఘాలను పిలిచి ఒక్క డిఎతో మమ అనిపించారు కూటమీ పాలనలో ఉద్యోగం ఉన్నవాడు..ఉద్యోగం లేని వాడు సంతోషంగా లేడు. 2.70 లక్షల వాలంటీర్లను పది వేలు ఇస్తానని మోసం చేశారు.ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం వల్ల ఖర్చు పెరిగిపోయిందని చంద్రబాబు మాట్లాడు తున్నారు. బేవరేజెస్‌లో 18 వేల ఉద్యోగులను తొలగించారు. ఫైబర్ నెట్ లో 2 వేల మంది ఉద్యోగులను తొలగించారు. ఎండియూ వాహనాల వ్యవస్థను రద్దు చేసి ఆనందం పొందుతున్నారు. ఆబ్కాస్‌ను రద్దు చేసే కార్యక్రమం చేస్తున్నారు.. చివరకు సచివాల ఉద్యోగులను కూడా మోసం చేశారు. చంద్రబాబు గతంలో బకాయిలు పెట్టిన రెండు డిఏలను వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెల్లించారు. ఆశ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచారు. వైఎస్ జగన్ వ్యవస్థలను విస్తృత పరిచారు. ఉద్యోగులకు బకాయిలను మనస్ఫూర్తిగా చెల్లించేందుకు వైఎస్ జగన్ ప్రయత్నించారు.' అని కురసాల తెలిపారు.

## మైలవరం వైఎస్ఆర్సిపి సెక్రటరీగా ఇంకొల్లు వెంకటరత్నం నియామకం

**మైలవరం, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



మైలవరం మండలం తోలుకోడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు ఇంకొల్లు వెంకటరత్నం(వెంకట్) ను వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మైలవరం వైఎస్ఆర్సిపి సెక్రెటరీగా నిర్మిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఇంకొల్లు వెంకటరత్నం మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీమంత్రి జోగి రమేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు వెంకట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా గుంజ శ్రీనివాసు

**కొండపల్లి, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సిఫార్సుల మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. నూతన అధికార ప్రతినిధిగా నియమితులైన శ్రీనివాసును పార్టీ పట్టణ నేతలు, కార్యకర్తలు అభినందించారు.

### పర్యాటకులు ప్రమాదాల గురికాకుండా

# బోట్లతో పెట్రోలింగ్ నిర్వహించాలి

- బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్

**బాపట్ల, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్)**



బాపట్ల, చీరాల బీచ్ లో పర్యాటకులు ప్రమాదాల గురికాకుండా సముద్రంలో బొట్లతో పెట్రోలింగ్ నిర్వహించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం వేటపాలెం మండలం పొట్టి సుబ్బాయపాలెం బీచ్ ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ బాపట్ల, చీరాల బీచ్ కు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా శని, ఆదివారం సిబ్బంది పెట్రోలింగ్ చేయాలని ఆయన అన్నారు. పెట్రోలింగ్ చేసే సిబ్బందికి లైఫ్ జాకెట్లు విజిల్స్ ఇవ్వాలని ఆయన పంచాయతి అధి కారులకు సూచించారు. వేటపాలెం పొట్టి సుబ్బా యపాలెం బీచ్ లో పారిశుద్ధ కార్యక్రమాలపై దృష్టి పెట్టా లని ఆయన అధికారులకు చెప్పారు. పొట్టి సుబ్బయ్య పాలెం నుండి రామాపురం బీచ్ వరకు రోడ్డును విస్తరణ చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు చెప్పారు. పొట్టి సుబ్బయ్య పాలెం బీచ్ లో ఫ్లెడ్ లైట్స్ ను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పొట్టి సుబ్బయ్య పాలెం బీచ్ లో మత్స్యకారులతో కలెక్టర్ మాట్లాడారు. బీచ్ లో మత్స్య కారులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులుచిన్న బోట్లతో సముద్రంలోకి వేటకు వెళ్ళినప్పుడు చెన్నై నుండి పెద్ద పెద్దబొట్లు వచ్చి తమకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెన్నై నుండి జాలర్లు రాకుండా చూడాలని కలెక్టర్ ను మత్యకారులు కోరారు. మత్స్యకారులు పొట్టి సుబ్బయ్య పాలెంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పొట్టి సుబ్బాయపాలెంలో లోవోల్టేజ్ సమస్య ఉందని ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్ ఫార్మ్ ఏర్పాటు చేయవల సిందిగా కలెక్టర్ ను మత్స్యకారులు కోరారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం ఎంపీడీఓ రాజేష్, తాసిల్దార్ గీతారాణి, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ హత్య కేసు నిందితుడు

### రియాజ్ బతికే ఉన్నాడు..

### ఎన్‌కౌంటర్ వార్త అవాస్తవం : సిపి

**జర్నలిస్ట్ ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 21 : నిజామాబాద్:** కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో ట్విస్ట్ నెలకొంది. నిందితుడు రియాజ్‌ను



ఎన్‌కౌంటర్ చేసి నట్లు వార్తలు గుప్పుమన్నాయి. సారంగపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు అతన్ని ఎన్ కౌంటర్ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఎన్‌కౌంటర్ ఘటనపై నిజామాబాద్ సీపీ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రచారం జరుగుతున్నట్లుగా నిందితుడు రియాజ్‌పై ఎలాంటి కాల్పులు జరపలేదని స్పష్టం చేశారు. రియాజ్ ప్రాణాలతోనే ఉన్నాడని తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తుండగా పట్టుబడ్డాడని, అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అయితే ఓ వ్యక్తితో జరిగిన ఘర్షణలో రియాజ్‌కు గాయాలయ్యాయని సీపీ పేర్కొన్నారు. రియాజ్‌కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామని, అతని ప్రాణాలతోనే ఉన్నారని తేల్చి చెప్పారు. నిజామాబాద్‌లోని సారంగపూర్ సమీపంలో ఎప్పుడో రోడ్డు ప్రమాదానికి గురై నిరుపయోగంలో ఉన్న ఒక లారీలో నిందితుడు రియాజ్ దాక్కున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి నుంచి 9 బృందాలతో పోలీసులు రియాజ్ కోసం గాలించారు. ఎట్టకేలకు రియాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు తప్పించుకునే క్రమంలో రియాజ్, మరో యువకుడికి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రియాజ్ కు గాయాలైనట్లు సమాచారం.

## పేద క్రీడాకారిణికి మాజీమంత్రి కెటిఆర్ భరోసా

**జర్నలిస్ట్‌ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 21 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఉదారత చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద క్రీడాకారిణికి అండగా నిలబడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేట గ్రామా నికి చెందిన పారా త్రోబాల్ ప్లేయర్ మిట్టపల్లి అర్చన స్వతహాగా ఎదిగింది. ఖేలో ఇండియా, నేషనల్ లెవల్ పారా త్రోబాల్ స్థాయిలో సత్తాచాటి ఇప్పుడు ఇండియా తరపున తెలంగాణ నుంచి శ్రీలంక లో పారా త్రోబాల్ ఆడటానికి అర్హత సాధిం చింది. పేద కుటుంబానికి చెందిన అర్చనకు చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తితోనే ఎంత కష్టమొచ్చినా ఈ స్థాయికి వచ్చింది. అద్దె ఇంట్లో ఇద్దరు పిల్లలను పోషిం చుకుంటూ తనకు ఇష్టమైన ఆటలో గెలుపే లక్ష్యంగా కృషిచేస్తున్నది. అయితే ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలుసుకున్నారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చి, ఆమెకు ఆటకు సంబంధించిన క్రీడా పరికరాలు, ఆర్థికసాయం చేసి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు.

## జనవరి 21 నుంచి 30 వరకు జెఇఇ మెయిన్ మొదటి సెషన్


### ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఎన్‌టిఎ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోని ఐఐటిలు, ఎన్ఐటీల్లో ఇంజి నీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) జాతీయ స్థాయిలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) (మెయిన్) పరీక్షను నిర్వహి స్తున్న సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది రెండు విడతలుగా జెఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జెఈఈ మెయిన్- 2026 మొదటి సెషన్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను శనివారం నుంచే స్వీకరించడం ప్రారంభించినట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. సిబిటి విధానంలో జెఇఇ మెయిన్-2026ను రెండు సెషన్‌లలో (జనవరి, ఏప్రిల్ 2026) నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి సెషన్1 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ ఎన్‌టిఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఎన్‌టిఏ డైరెక్టర్ ఎగ్జామ్స్ ప్రకటించారు. రెండో సెషన్‌కి సంబంధించిన పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జనవరి చివరి వారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌తోపాటు, మెమో ఆధారంగా ఉన్న పేర్లను నమోదు చేసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## పాల్వంచ ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఎసిబి దాడి

### 25,100 నగదు స్వాధీనం

**పాల్వంచ, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్ధరాత్రి నుంచి ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడులు నిర్వహించారు. అసలు ఏం జరుగుతుందో తెలియదు... అక్కడ ఉన్న వారు కూడా ఒక్కసారిగా షాక్ అయ్యారు... తేరుకునే సరికే అధికారులు సోదాలు మొదలుపెట్టారు. పాల్వంచ జాతీయ రహదారిలోని నాగారం లో ఉన్న అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టుపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దాడులు నిర్వహించింది. ఖమ్మం జిల్లా ఏసీబీ డిఎస్పీ రమేష్ ఆదేశాల మేరకు వరంగల్ ఏసీబీ డీఎస్పీ



సాంబయ్య బృందం ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి దాడి చేశారు. గత కొద్ది రోజులుగా ఈ చెక్‌పోస్టులో అవినీతి జరుగుతోందని, రవాణా శాఖ అధికారులు రహదారిపై వెళ్లే వాహనదారులపై ఆర్టీఏ చట్టం ప్రకారం సరైన ఫైన్లు వేయకుండా లేదా వైలెట్ చేసిన వారికి ఫైన్లు వేయకుండానే ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు ఏసీబీ దృష్టికి వచ్చాయి. ముఖ్యంగా, ప్రభుత్వం చెక్‌పోస్టులను ఎత్తివేసినప్పటికీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అదే స్థానంలో అనధికారికంగా చెక్‌పోస్టులను నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

పై అధికారుల సూచన మేరకు రంగంలోకి దిగిన వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, తమ ఇన్‌స్పెక్టర్ నట్ల రాజు, లావుడియా రాజులు బృందంతో కలిసి రాత్రి 12:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సిబ్బంది వద్ద ఓవల్ ఓవర్ లోడ్ వాహనాల నుంచి ఫైన్ వేసినట్లుగా రసీదులు, పర్మిట్లు ఇచ్చినట్లుగా, టాక్సీ కలక్షన్ చేసినట్లు గాని ఎలాంటి ఓచర్లు లేని నగదు రూ. 25,100 అన్‌అకౌంటెడ్ (లెక్కల్లో చూపని) నగదును గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన నగదు పై చెక్ పోస్ట్ లో ఉన్న మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ మనోహార్ ను వివరణ కోరిన ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో దాడి చేసిన డిఎస్పీ సాంబయ్య తనిఖీల వివరాలపై సమగ్ర నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ప్రజలకు ఏవైనా ప్రభుత్వ ఉద్యోగులు తమ పనులు చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తే, వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సాంబయ్య విజ్ఞప్తి చేశారు.

### ఈ నెల 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

## బిసి గురుకుల డిగ్రీ కాలేజీలో బిఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో ప్రవేశాలు

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెను కబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న డిగ్రీ కాలేజీలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజేటిఏయు) అనుబంధ కాలేజీలో బిఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం ఈ నెల 21 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్‌మీడియట్ (బైపీసీ గ్రూప్) దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు, తెలంగాణ స్టేట్ టీజీ ఈఏపీసెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ సెక్రటరీ సూచించారు. ఈ కోర్సు లో చేరడానికి దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ 1,50,000.. పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదా యం రూ. 2,00,000 మించకూడదని సూచించారు.

ఆసక్తి గల విద్యార్థులు ప్రాస్పెక్టస్‌ను పరిశీలించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం బిసి గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు. ఈనెల 21 నుంచి 29వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు రుసుము రూ.1,000/ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. అభ్యర్థుల ఎంపిక టిజి ఎప్‌సెట్-2025 ర్యాంకుల ఆధారంగా జరు గుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 040-23328266 నంబరులో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని, బిసి గురుకుల సొసైటీ మెయిల్‌కు మెయిల్ చేయవచ్చని గురుకుల సొసైటీ సెక్రటరీ బడుగు సైదులు సూచించారు.

## అగ్రవర్ణ పేదల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### ఇబిసి జాయింట్ యాక్షన్ కమిటీ

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** అగ్రవర్ణ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇబిసి కమిషన్, ఇబిసి డిపార్టుమెంటర్ ఏర్పాటు చేయాలని ఫార్వర్డ్ క్యాస్ట్ ఇబిసి జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో 18 అగ్రవర్ణ కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. అగ్రవర్ణ పేదల విద్యాభివృద్ధికి ఇబిసి స్టడీ సర్కిళ్లు, ప్రత్యేక ఇబిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఇతర కులాల వారు ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించటం సరికాదన్నారు. అగ్రవర్ణ నేతలను ఇష్టానుసారంగా దూషించడం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ మానసిక వేదనను గురిచేస్తున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇబిసి హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిస్తామని తెలిపారు.

## ట్యాంక్ బరువుతో కుప్పకూలిన రేకుల హోటల్

### ప్రమాదంలో ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**చిట్యాల రూరల్, అక్టోబరు21(జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ రహదారి పక్కన కొత్తగా నిర్మించిన ఓ హోటల్ పైకప్పు కూలిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషాద ఘటన చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గుల



పల్లికి చెందిన తగుళ్ల వెంకన్న పెద్దకాపర్తి శివారు లోని పెద్దచెరువు సమీపంలో 'డాంకిట్ ఫిల్టర్ కాఫీ' పేరుతో హోటల్ నిర్మించాడు. హోటల్ నిర్మాణంలో భాగంగా పైకప్పు రేకులపై 2వేల లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం హోటల్ ప్రారంభోత్సవం ఉండటంతో శనివారం రాత్రి వెంకన్న కుటుంబంతో కలిసి హోటల్‌లో బస చేశారు. అదేరాత్రి వాటర్ ట్యాంక్‌ను నీటితో నింపగా, తెల్లవారుజామున నీటి బరువును తట్టుకోలేక పైకప్పు రేకులు కూలిపోయాయి. లోపల నిద్రిస్తున్న వెంకన్న భార్య నాగ మణి, కుమా రుడు విరాట్‌కృష్ణ, తల్లి పార్వతమ్మ, కూతురు నందిని తీవ్రంగా గాయపడ్డారు. వారిని నార్కట్‌పల్లి కామి నేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగమణి (32), విరాట్ కృష్ణ (7) మృతి చెందారు. పార్వతమ్మ, నందిని పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలిం చారు. ఈ ఘటనపై హోటల్ యజమాని వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు. పెద్దకాపర్తి శివారు లోని పెద్దచెరువు బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండానే హోటల్ నిర్మించినట్టు సమాచారం

## పుట్టింటికి వెళ్తూ ప్రమాదంలో దుర్మరణం

### బైక్‌ను ఢీ కొట్టిన కారు.. గృహిణి, ఆమె తమ్ముడు, చిన్నారి మృతి, మరో చిన్నారికి ఆస్పత్రిలో చికిత్స

### కాగజ్‌నగర్ మండలంలో పండగపూట విషాదం

**ఆసిఫాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల పరిధిలోని వంజిరి గ్రామంకు చెందిన అక్కను ఆమె కుమారుడు (అల్లునికి) వాంకిడి మండలం బెండరకు చెందిన తమ్ముడు దీపావళి పండుగకు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై పుట్టింటికి సంతోషంగా వెళ్తున్న క్రమంలో ఒక కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన ఆదివారం ఆసిఫాబాద్ మండలంలో పండగ పూట విషాద ఘటన చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామానికి చెందిన జగన్ (27), డోంగ్రి అను సూయ (32) ప్రజ్ఞీల్ 4, మరో పాపతో కలిసి దీపావళి పండగను జరుపుకోనేందుకు వాంకిడి మండలం లోని బెండార గ్రామానికి బయలు దేరారు. బైక్ ఎక్కించుకొని బెండారకు వస్తున్న క్రమంలో మోతుగూడ సమీపంలో బైక్ ను కారు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో జగన్‌తో పాటు అక్క అనుసూయ, మేనల్లుడు ప్రజ్ఞీల్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న మరో పాప చికిత్స కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరం దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెల కొన్నాయి.

కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాదం తెలుసు కున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు సంఘటన స్థలం చేరుకొని కుటుంబసభ్యు లను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై ఎసిబి దాడులు

### లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల దగ్గర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి తనిఖీలను నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా పలు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. సోదాల్లో పలుచోట్ల లెక్కల్లో చూపని భారీ మొత్తంలో నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని మద్గి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం జిల్లాల్లోని పలు ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అధికారుల దాడుల్లో భాగంగా కొమరం భీం జిల్లాలోని బోరాజ్ చెక్ పోస్టులో రూ. 1,26,000, వాంకిడి చెక్‌పోస్టులో రూ. 5,100 అక్రమ నగదును అధికారులు సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సాలబత్ పూర్ ఆర్టీవో చెక్‌పోస్టులోనూ సోదాలు జరిగాయి. బిక్కనూరు మండలం పొందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్ వద్ద ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ. 51,300 స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ మరో రూ. 3,000 పట్టుబడ్డాయి. దీపావళి పండుగ వేళ... తెలంగాణ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారుల నుంచి కొందరు సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులతో ఏసీబీ ఈ చర్యలు చేపట్టినట్టు తెలిసింది.

## పార్టీ ద్రోహులను శిక్షించండి

### మల్లోజుల, ఆశన్నలు పార్టీకి ద్రోహం చేసారు

### మావోయిస్టు కేంద్ర ఆధికార ప్రతినిధి అభయ్

**చర్ల, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్లోజుల, ఆశన్నలు విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకులుగా, విప్లవ ప్రతిఘాత కులుగా మారి శత్రువుకు లొంగిపోయారని వారిని పార్టీ అనుచరులకు తగిన శిక్ష విధించాల్సి ఉదిగా మావోయిస్టు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పత్రికలకు లేఖ విడుదల చేసారు. మల్లోజుల ఆశన్న ముఠాను పార్టీ నుండి బహిష్కరిస్తున్నాం. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు వివేక్, డీకే ఎస్.జెడ్.సీ. ప్రత్యమ్నాయ సభ్యురాలు దీప ( రనిత ) 10 మంది డివిజనల్ కమిటీ కంపెనీ పార్టీకమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు, పీ.ఎల్.జీ.ఏ. సభ్యులు మొత్తం 61 మంది అక్టోబర్ 14 నాడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో గడ్చిరోలీలో పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసారు. పార్టీకి విప్లవ ప్రజలకు చెందిన 50 తుపాకుల్ని శత్రువుకు అప్పగించారు. ఈ లొంగుబాటు విప్లవ ద్రోహం, పార్టీ విచ్ఛిన్నకర చర్య అని అభివర్ణించారు. 2011 చివరి నుండి గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వచ్చిన దండకారణ్య విప్లవోద్యమం, దేశవ్యాప్త విప్లవోద్యమం 2018 నాటికి తాత్కాలిక వెనకంజకు గురయ్యాయి. అప్పటినుండి మల్లోజులలో రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయి. 2020 డిసెంబర్ లో జరిగిన కేంద్రకమిటీ సమావేశంలో సోను దండకారణ్య విప్లవ ఆచరణలోని కొన్ని లోపాలపై స్వీయాత్మక విశ్లేషణతో కూడిన నిర్ధారణలు చేస్తూ ఒక పత్రాన్ని ప్రవేశపెట్టాడు. దాన్ని కేంద్రకమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడు జరుగుతూ వచ్చిన కేంద్రకమిటీ (సీసీ), పొలిట్ బ్యూరో (పీబీ) సమావేశాల్లో ఆయనలోని తప్పుడు రాజకీయ భావాలను విమర్శించి, సరిదిద్దడానికి సెంట్రల్ కమిటీ కృషి చేసింది అయినా 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్లీనం మల్లోజుల వ్యక్తివాదాన్ని అహంభావాన్ని, తీవ్రమైన పెత్తందారీతనాన్ని (బ్యూరాక్రసీని) తీవ్రంగా విమర్శించి, వాటిని సరిదిద్దుకోవాలని కోరింది. ఆ తర్వాత జరుగుతూ వచ్చిన డీకే ఎస్.జెడ్.సీ. సమావేశాల్లో ఎస్. జెడ్.సీ. సభ్యులు ఆయన్ను విమర్శించారు.

2025 మే నెలలో జరిగిన కగార్ దాడిలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు (బసవరాజు) చనిపోయిన తర్వాత సోనులో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకుని శత్రువు ముందు మోకరిల్లేలా చేసాయి. 2024 జనవరి నుండి మొదలయిన విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధంతో విప్లవకారులందరు, విప్లవ ప్రజలందరు ప్రతిరోజూ శత్రు దాడులను ఎదుర్కొంటూ పనిచేసే పరిస్థితి ఏర్పడింది. సోనులో పెరుగుతూ వచ్చిన స్వార్థం ఆ త్యాగానికి సిద్ధపడని స్థితికి ప్రాణభీతికి దారితీసింది. ఈ విషయాన్ని నిజాయితీతో అంగీకరించడానికి ఆయన సిద్ధపడలేదు. కానీ ఆయన తనలో దీర్ఘకాలంగా ఉన్న అహంభావాన్ని సరిదిద్దుకొని ఫలితంగా తన బలహీనతలకు, ప్రాణభీతికి ముసుగు కప్పి పార్టీ అనుసరిస్తున్న తప్పుడు రాజకీయ సైనిక పంథా (వ్యూహం) ఫలితంగా భారత విప్లవోద్యమం ఓటమి పాలయ్యే స్థితికి దారి తీసిందని, ఈ స్థితిలో ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి, తాత్కాలిక సాయుధ పోరాట విరమణ చేయడం మినహా మరో మార్గం లేదనే మితవాద అవకాశవాద, రివిజనిస్టు వైఖరితో కూడిన లొంగుబాటు పత్రికా ప్రకటనను విడుదల చేసాడు.

వస్తుగత స్థితిని, స్వీయాత్మక స్థితిని, శత్రు బలాబలాలను, ఉద్యమ బలాబలాలను వాస్తవికంగా విశ్లేషిస్తారు. అందులో భాగంగా అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులను విశ్లేషిస్తారు. కానీ ఆయన ఈ మధ్య రాసిన వ్యాసాల్లో, ప్రజలకు విజ్ఞప్తి, కేడర్లకు విజ్ఞప్తి పత్రాల్లో, సెప్టెంబరు 15న విడుదల చేసిన పత్రికా ప్రకటనలో దీనికి భిన్నమైన బూర్జువా స్వీయాత్మక విశ్లేషణ పద్ధతి ఉంది. నిజంగా సోనుకు తను రాసిన వాటిపై విశ్వాసం ఉంటే పార్టీలో ఉంటూ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో చర్చించడానికి సిద్ధపడాలి.ప్రాణ త్యాగానికి సిద్ధపడి విప్లవానికి నాయకత్వం వహిస్తూ తన అభిప్రాయాలను వాదనలను పార్టీతో చర్చించి కృషిచేసి ఉంటే బాగుండేదని అలా కాకుండా లొంగిపోయాడని అన్నారు. అలా కాకుండా వివిధ స్థాయి కేడర్లకు తప్పుడు సంకేతాలు ఇస్తూ పార్టీ సభ్యులలో విభేదాలు సృష్టించి విచ్ఛిన్నం చేసే చర్యలకు పూనుకున్నాడని లేఖలో తెలిపారు.

ఇలాంటి ఒడిదొడుకులను ఎన్నోసార్లు చవి చూసామని ఎంత అనిచి వేసిన ద్రోహం చేసినా పార్టీ మరింత పుంజుకుంటుందని అన్నారు.విప్లవోద్యమాన్ని పురోగ మనం కోసం మరింత ఆత్మవిశ్వాసంతో ధైర్య సహసాలతో ముందుకు సాగుతామని అంతిమ విజయం ప్రజలదేనని అభయ్ పేరిట పత్రికలకు పంపిన లేఖలో పేర్కొన్నారు.



## న్యూఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాల్సిందే!

### ఢిల్లీ మంత్రి కపిల్‌మిశ్రాకు విహెచ్‌పి లేఖలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 21 :** దేశరాజధాని న్యూఢిల్లీ నగరం పేరును 'ఇంద్రప్రస్త'గా మార్చాలని విశ్వహిందూపరిషత్ ఆదివారం డిమాండ్‌చేసింది. ఢిల్లీ సాంస్కృతిక మంత్రి కపిల్‌మిశ్రాకు లేఖకూడా రాసింది. అలాగే ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును ఇంద్రప్రస్థఅంతర్జాతీయ విమానాశ్రయంగాను, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను కూడా ఇంద్రప్రస్థ రైల్వేస్టేషన్, షాజహానాబాద్ డెవలప్ మెంట్‌బోర్డును ఇంద్రప్రస్త డెవలప్‌మెంట్ బోర్డుగా పేర్లు మార్చాలని విహెచ్‌పి ఢిల్లీ మంత్రికి రాసిన లేఖల్లో వివరించింది. ప్రాచీన చరిత్ర, సంస్కృతికి ప్రతిబింబంగా ఢిల్లీనగరం పేరునిలుస్తుందని అందుకే ఇంద్రప్రస్థగామార్చాలని డిమాండ్‌చేస్తున్నట్లు వివరించింది. ఇంద్రప్రస్థ పేరు ఈనాడు కొత్తగా వచ్చింది కాదని ఐదువేల ఏళ్ల క్రితమే ఈ పేరు వాడుకలో ఉందని ఢిల్లీ విహెచ్‌పి కార్యదర్శి సురేంద్ర కుమార్ గుప్తా అన్నారు. ఢిల్లీ వారసత్వ సాంప్రదాయం అంతాకూడా కోటలు, దేవాలయాలు, హిందూ రాజుల చుట్టూనే ఉండాలని నగరం మొత్తం చరిత్ర హిందూసాంప్రదాయం ప్రతిబింబించేదిగా లేదని ఆయన పేర్కొన్నారు. పాండవుల కాలంలోని స్థలాలు, కోటలు ముస్లింలు దండయాత్రలు చేసి ఆక్రమించు కున్నారరని, అందువల్ల పాండవుల కాలంనాటి స్మృతిచిహ్నాలను ముస్లిం చిహ్నాల సమీపంలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కింగ్ హేమచంద్ర విక్రమాదిత్య పేరిట ఒక మిలిటరీస్కూలును కొనసాగించాలని గుప్తాడిమాండ్‌చేసారు. చరిత్రకారులు, పరిశోధకులు ఇచ్చిన సలహాలు సూచనలు ఆధారంగానే పేర్లు మార్చాలని ప్రతిపాదిస్తున్నట్లు విహెచ్‌పి కార్యదర్శి వెల్లడించారు.

## పప్పుదినుసుల విత్తనం పంపిణీ

### రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 21(జర్నలిస్ట్ ఫైల్) :** రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా జాతీయ ఆహార భద్రతా పథకంలో మేలైన పప్పుదినుసు వంగడాల విత్తనం పంపిణీకి చర్యలు చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో వరితో పాటు, పప్పుదినుసులు, నూనె గింజల సాగును కూడా పెంచే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇందులో భాగంగా ఈ యాసంగిలో రూ.2.68 కోట్ల సబ్సిడీతో 19,397 ఎకరాలకు సరిపడా 5825 క్వింటాళ్ల శనగ విత్తనాలు 14 జిల్లాలలో పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఇటీవల పంపిణీ చేసిన వేరుశనగతో పాటు, హైబ్రిడ్ పొద్దుతిరుగుడు (83.78 క్వింటాళ్లు) సీడ్, 74 క్వింటాళ్ల కుసుమ విత్తనాలకు 45.41 లక్షల మొత్తాన్ని వినియోగించి పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ 2025-26 లో రూ.48.54 కోట్లతో జాతీయ ఆహార భద్రత పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగే ఇప్పటికే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. ఇక గత సీజన్ లో జిల్లాకు ఎంపిక చేసిన ఒక మండలంలో 1.39 లక్షల మట్టి నమూనాలు సేకరించి, వాటి విశ్లేషణ పూర్తి చేసి ఫలితాలు అందచేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఇంకో 1.70 లక్షల మట్టి నమూనా ఫలితాలు విశ్లేషణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. నేచురల్ ఫార్మింగ్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. దీని క్రింద క్లస్టర్ల గుర్తింపు మరియు శిక్షణ పూర్తితో పాటు, మరోవైపు వానాకాల పంటల కొనుగోళ్ల ప్రక్రియ, ఇంకోవైపు యాసంగి పథకాల అమలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర రాష్ట్ర వాటాలతో అమలు అయ్యే పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తూ, గరిష్ట స్థాయిలో రైతుల ప్రయోజనం చేకూరేలా వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలు చర్యలు చేపట్టాయని తెలియజేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో రాష్ట్ర రైతాంగం గత పదేళ్లలో దాదాపు రూ.3 వేల కోట్ల మేర నష్టపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను పూర్తి స్థాయిలో వాడుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. దానికి తగ్గ రాష్ట్రవాటా నిధులు విడుదలచేసి రాష్ట్ర రైతులకు ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి పరమావధిగా పేర్కొన్నారు.

## ఆర్థిక సంక్షోభంలో గిరిజన సహకార సంస్థ

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో భారీ మొత్తాలు కేటాయిస్తున్నారు. కానీ, కేటాయించిన నిధుల్లో విడుదలవుతున్నది మాత్రం అతి తక్కువ శాతమే. 2024-25లోనూ 360 కోట్లు కేటాయించినా. ఒక్క పైసా విడుదల కాలేదు. ఆ నిధులను కూడా ఈ ఏడాది విడుదల చేసి ఖర్చు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ట్రైకార్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌లో ట్రైకార్‌కు రూ.2,300 కోట్లు కేటాయించింది.

## దారుణంగా పడిపోయిన నిమ్మ

### ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, అక్టోబరు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** నిమ్మ రైతులు కనీవినీ ఎరుగని రీతిలో నష్టాలను చవిచూస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో కిలో వంద రూపాయలకు పైగా పలికిన నిమ్మ ధర ప్రస్తుతం దారుణంగా పతనమై కిలో 15 నుంచి 20 రూపాయలకే పరిమితమైంది. ఈ ఊహించని ధరల పతనంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏడాదిన్నర పాటు మార్కెట్లో నిమ్మ ధరలు ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రస్తుతం ఒక్కసారిగా ధరలు తగ్గడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఇదే సమయంలో కిలో 100 రూపాయల నుంచి 200 రూపాయల వరకూ పలికిన ధర ఇప్పుడు 20 రూపాయల కంటే తక్కువగా ఉండటం రైతులను ఆందోళనలకు గురి చేస్తోంది. రాష్ట్రంలో పండే 90 శాతం నిమ్మ ఒక్క ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే సాగవుతోంది. ఇక్కడి నుంచే ఢిల్లీ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతి జరుగుతుంది. ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తూ లక్షల రూపాయల్లో ఖర్చు చేసిన రైతాంగం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఒక బస్తా కాయలు రూ.50 నుంచి రూ.100 ఉండగా, పచ్చివి రూ.100 నుంచి రూ.200లకు మించి పలకడం లేదు. కూలీలు, ఆటో కిరాయిలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో చాలా తోటల్లో కాయలు కోయకుండానే చెట్లకే వది లేస్తున్న దుస్థితి నెలకొంది. లక్షలు వెచ్చించి తోటలు కొన్నవారు, అధిక మొత్తంలో కౌలుకు తీసుకున్నవారు అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పెట్టిన పెట్టుబడిలో సగం కూడా దక్కడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు, దళారులు కుమ్మక్కై కృత్రిమంగా ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అకాలవర్షాలు కూడా పంటదిగుబడి, నాణ్యతపై ప్రభావం చూపాయని, ఇది కూడా ధరల పతనానికి కొంత కారణమని చెబుతున్నారు.

# 25 మందితో ఎంఐఎం జాబితా



## ఇద్దరు హిందువులకు అవకాశం

### సివాన్ నుంచి క్రికెటర్ కైఫ్ పోటీ



**బీహార్‌లో ఇంకా 'సర్దుబాట్ల' లోనే కూటములు**


**పాట్నా, అక్టోబరు 21 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసి ఆదివారంనాడు 25మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ముస్లిమేతరులు ఉన్నారు. టీమిండియా మాజీ క్రికెటర్‌కు మజ్లిస్ టికెటిచ్చింది. ఎంఐఎంకు ఉన్న ఏకైక ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ పేరు కూడా జాబితాలో ఉంది. ఏఐఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ కథనం ప్రకారం, ముస్లిం జనాభా అధికంగా ఉన్న సీమాంచల్ రీజియన్‌పై ప్రధానంగా ఫోకస్ పెట్టింది. భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ 'సివాన్' నుంచి పోటీ చేస్తున్నారు. గయ దక్షిణ-మధ్య జిల్లాలోని రిజర్వ్ సీటు సికంద్రా నుండి మనోజ్‌కుమార్ దాస్‌ను ఎంఐఎం నిలబెట్టింది. ఇక్కడ ఎన్‌డిఎ తరఫున, సిట్టింగ్ ఎమ్మెల్యే హెచ్‌ఎఎం అధినేత జితిన్ రామ్ మాంఝీ తనయుడు ప్రఫుల్ కుమార్ మాంఝీ బరిలో ఉన్నాడు. నేపాల్ సరిహద్దులోని తూర్పు చంపారన్ నియోజకవర్గం నుంచి రాణా రంజీత్‌సింగ్‌కు ఎంఐఎం బరిలోకి దించింది. మాజీ మంత్రి, మధుబన్ సిట్టింగ్ ఎమ్మెల్యే బిజెపినేత రానా రణ్‌ధీర్‌సింగ్ సోదరుడు కావడం విశేషం. గత ఎన్నికల్లో 19 స్థానాల్లో పోటీచేసి 5 సీట్లు గెలిచింది. అయితే, తదనం తర రాజకీయపరిణామాలతో నలుగురు ఎమ్మెల్యేలు ఆర్‌జెడిలో చేరిపోయిన విషయం తెలిసిందే.

**జెఎంఎం ఒంటరిగానే బరిలోకి**

మహాఘట్ బంధన్‌లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కిరాలేదు. కూటమిలోని భాగస్వామ్య పార్టీ జెఎంఎం ఈసారి ఒంటరిగానే బరిలోకి దిగుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య తెలిపారు. ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. జార్ఖండ్ సరిహద్దులోని ప్రాంతాలపైనే జెఎంఎం ప్రధానంగా దృష్టి సారించింది. చకాయ్, ధామ్దహ, కటోరియా(ఎస్‌టి), పిర్‌పెయింటి, మణిహారి(ఎస్‌టి), జముయి స్థానాల్లో జెఎంఎం పోటీ చేయాలని నిర్ణయించినట్లు సుప్రియో భట్టాచార్య వివరించారు.

**24 నుంచి ప్రధాని మోడీ ప్రచారం**

బీహార్ ఎన్నికల్లో ఎన్‌డియే అభ్యర్థుల తరఫున ఈ నెల 24 నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రచారంచేయనున్నారు. సమస్తిపూర్ నుంచి మోడీ ఎన్నికల ప్రచారం శ్రీకారం చుట్టనున్నారని బిజెపి బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ తెలిపారు. ఆతర్వాత బెగుసరాయ్‌లో మరో ఎన్నికల ర్యాలీలో మోడీ పాల్గొంటారని, ఈ నెలాఖరులోపు నాలుగు కంటే ఎక్కువ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి పాల్గొంటారని దిలీప్ జైస్వాల్ వివరించారు. దాదాపు 25 ప్రచార సభల్లో మోడీ పాల్గొనేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. నితీశ్‌కుమారే ఎన్‌డియేముఖ్యమంత్రిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నామని కేంద్రమంత్రిగిరిరాజ్‌సింగ్ తెలిపారు.



## రష్యా కీలక గ్యాస్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి!

**మాస్కో, అక్టోబరు 21 :** రష్యాలోని ఓరెన్‌బర్గ్ ప్రాంతంలోని అతిపెద్ద గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. కీవ్‌కు తూర్పువైపు 1,700 కిలోమీటర్ల దూరం చొచ్చుకొచ్చి మరీ ఈ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడుల శక్తిని గణనీయంగా పెంచుకొందనడానికి ఈ దాడి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి కారణంగా ప్లాంట్లలోని ఓ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వీటిని అదుపులోకి తెచ్చినట్లు ఆ ప్రాంత గవర్నర్ వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. దాడి చోటుచేసుకున్న ప్రదేశం జనావాసాలకు అతి దగ్గరగా ఉందని చెప్పారు. రష్యాలోని సుదూర ప్రాంతాల్లో కూడా ఉక్రెయిన్ దళాలు డ్రోన్లు దాడులు చేస్తున్నాయి. గత నెల దాదాపు 2,000కిలోమీటర్ల మేరకు లోపలకు చొచ్చుకొచ్చి దాడికి తెగబడ్డ ఘటనలున్నాయి. రష్యా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు ఇది సవాలుగా మారింది. సైబీరియా, ఊరల్ పర్వతాల్లో చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొంటున్నాయి. తాజా సమర రీజియన్‌లో కూడా డ్రోన్‌దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే స్థానికులు మాత్రం ఇది చమురు రిఫైనరీని లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతున్నారు. కానీ, ఈ దాడిపై గవర్నర్ మాత్రం ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.



## సిఎం రేఖాగుప్తాపై దాడికేసులో 400 పేజీల ఛార్జిషీట్

**న్యూఢిల్లీ, అక్టోబరు 21 :** ఢిల్లీముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడికి పాల్పడిన సంఘటనలో ఢిల్లీపోలీసులు సకారియా రాజేష్‌భాయ్ ఖీమీజ్ఞభాయ్ అనే నిందితుడిపై కోర్టులో ఛార్జిషీటు దాఖలుచేసారు. సుమారు 400 పేజీలకుపైగా ఈ ఛార్జిషీటు దాఖలయింది. రాజేష్‌తోపాటు అతడి మిత్రుడు సయ్యద్ తహ్సీన్‌అజాపైనా వివిధ అభియోగాలకింద ఈ ఛార్జిషీటు దాఖలు చేసారు. వీధికుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థించారన్న కారణంతో ఢిల్లీ సీఎం రేఖాగుప్తాపై నిందితుడు ఆగ్రహంతో ఉన్నాడని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. 40మందికిపైగాసాక్షుల వాంగ్మూలాలను అందులో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఈ ఛార్జిషీటును పరిగణనలోనికి తీసుకున్న కోర్టువిచారణను ఈనెల30కి వాయిదా వేసింది.

## తండ్రికి కొవిడ్19 సోకితే పుట్టబోయే పిల్లల మెదడు ఎదుగుదలలో లోపాలు

**మెల్‌బోర్న్, అక్టోబరు 21 :** కరోనా మహమ్మారి మానవాళిపై చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. అయితే, ఈ వైరస్ ప్రభావం కేవలం సోకిన వ్యక్తికే పరిమితం కాదని, వారి తర్వాతి తరంపైనా పడొచ్చన్న ఒక కొత్త అధ్యయనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గర్భధారణకు ముందు తండ్రికి కొవిడ్19 సోకితే, పుట్టబోయే పిల్లల మెదడు ఎదుగుదల, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఈ పరిశోధనలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అధ్యయన వివరాలను ప్రఖ్యాత సైన్స్ జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్ ప్రచురించింది. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ యూనివర్సిటీకి చెందిన ఫ్లోరే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్ పరిశోధకులు ఈ సంచలన అధ్యయనాన్ని నిర్వహించారు. వారి పరిశోధన ప్రకారం, కోవిడ్19కు కారణమయ్యే సార్స్‌కోవ్2 వైరస్, తండ్రి శుక్రకణాల్లో అణుస్థాయిలో మార్పులు తీసుకువస్తోందని తేలింది. ఈ మార్పుల కారణంగా, వారికి పుట్టే పిల్లల్లో ఆందోళన సంబంధిత ప్రవర్తనలు ఎక్కువగా కనిపించాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా, పరిశోధకులు మొదట మగ ఎలుకలకు కరోనా వైరస్ సోకేలా చేశారు. అవి పూర్తిగా కోలుకున్న తర్వాత, ఆరోగ్యంగా ఉన్న ఆడ ఎలుకలతో జత కట్టించారు. ఆశ్చర్యకరంగా, కరోనా బారినపడిన తండ్రి ఎలుకలకు పుట్టిన పిల్లలన్నింటిలోనూ అధిక స్థాయిలో ఆందోళన లక్షణాలు కనిపించాయి. ముఖ్యంగా, ఆడ పిల్ల ఎలుకల మెదడులోని హిప్పోక్యాంపస్ భాగంలో జన్యువుల పనితీరులో మార్పులు గుర్తిం చారు. జ్ఞాపకశక్తి, భావోద్వేగాలు, ఆందోళన వంటివాటిని నియంత్రించడంలో ఈ భాగం చాలా కీలకం. తండ్రి శుక్రకణాల్లోని కొన్ని ఆర్‌ఎన్‌ఏ అణువులను కరోనా వైరస్ మార్చేయడమే దీనికి కారణమని పరిశోధకులు తేల్చారు. ఈ ఆర్‌ఎన్‌ఏ అణువులు మెదడు అభివృద్ధికి సంబంధించిన జన్యువులను నియంత్రిస్తాయి. వీటిలో మార్పులు రావడం వల్ల పిల్లల నాడీ వ్యవస్థ ఎదుగుదలపై ప్రభావం పడుతోందని అధ్యయన సహ రచయిత్రి డాక్టర్ కరోలినా గూబర్ట్ తెలిపారు. వస్తుతానికి ఈ అధ్య యనం ఎలుకలపైనే జరిగినప్పటికీ, దీని ఫలితాలను తేలికగా తీసుకోలేమని పరిశోధక బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ ఆంథోనీ హన్నన్ హెచ్చరించారు.

## కాల్పుల విరమణకు పాక్, అఫ్ఘాన్ అంగీకారం

### ఫలించిన దోహా శాంతి చర్చలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 21 :** అఫ్ఘానిస్థాన్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు తెరపడింది. ఇరు మధ్య జరిగిన శాంతి చర్చలు ఫలించాయి. ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో దోహా వేదికగా జరిగిన చర్చల్లో తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈమేరకు ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. రెండు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని పేర్కొంది. ఈ చర్చల్లో ఇరుదేశాలకు చెందిన రక్షణ మంత్రులు పాల్గొన్నారు. కాగా, ఇరు దేశాల మధ్య కుదిరిన 48 గంటల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ అఫ్ఘనిస్థాన్‌పై పాక్ శుక్రవారం అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు స్థానిక క్రికెటర్లు సహా 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని పాక్ భద్రతాధికారులు కూడా ధ్రువీకరించారు. అయితే, తాము చేసిన ఈ దాడుల్లో దజన్ల మంది సాయుధ దళాల సిబ్బంది మరణించారని, పౌరులెవరూ ప్రాణాలు కోల్పోలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన అఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు త్వరలో పాకిస్థాన్, శ్రీలంకతో జరగనున్న ముక్కోణపు సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని పక్తికా ప్రావిన్సులోని జిల్లాలపై పాక్ వైమానిక దాడులకు దిగినట్టు అధికారులు తెలిపారు. పాక్ దాడుల్లో మరణించిన ముగ్గురు క్రికెటర్లను కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్‌గా గుర్తించారు. వీరు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ కోసం ప్రొవిన్షియల్ రాజధాని అయిన షరానాకు వెళ్లి తిరిగి ఉర్గున్ జిల్లాలోని తమ ఇంటికి చేరుకోగా పాక్ దాడుల్లో మరణించారు. ఈ దాడుల్లో మరో ఐదుగురు మరణించారని, ఏడుగురు గాయపడ్డారని అఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. తాజా ఒప్పందం ద్వారా దజన్ల కొద్దీ మరణాలకు, వందలాది మంది గాయపడటానికి కారణమైన సరిహద్దు ఘర్షణలకు తాత్కాలికంగా తెరపడినట్లయింది. ఖతార్ రాజధాని దోహాలో టర్కీ సహకారంతో జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అఫ్ఘనిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ముల్లా మహమ్మద్ యాఖూబ్, పాకిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ఈ చర్చలకు నాయకత్వం వహించారు. ఈ ఒప్పందం సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సమావేశాలు నిర్వహించనున్నట్లు ఖతార్ తెలిపింది. 2021లో అఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారం చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య ఇంతటి తీవ్రస్థాయిలో ఘర్షణలు జరగడం ఇదే మొదటిసారి. అఫ్ఘనిస్థాన్ భూభాగం నుంచి తమ దేశంపై ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని, వాటిని తక్షణమే అరికట్టాలని పాకిస్థాన్ డిమాండ్ చేయడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను తాలిబన్ ప్రభుత్వం ఖండించింది. పాకిస్థానే తమ దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఐఎస్ సంబంధిత గ్రూపులకు మద్దతిస్తోందని ఎదురుదాడి చేసింది. సుమారు 2,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో శాంతిని నెలకొల్పేందుకు దోహాలో కుదిరిన ఈ ఒప్పందం కీలకమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## లావ్రే మ్యూజియంలో నెపోలియన్ కాలంనాటి ఆభరణాలు చోరీ



**ప్యారిస్, అక్టోబరు 21 :** ప్రపంచప్రఖ్యాత ప్యారిస్‌లోని లోవ్రే మ్యూజియంలో నెపోలియన్ కాలం నాటి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కేవలం ఏడునిమిషాల్లోనే గ్యాస్ కట్టర్ల సాయంతో దొంగలు మ్యూజియంలోకి చొరబడి విలువైన వస్తువులు దొంగిలించుకునిపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఈ దోపిడీ జరిగిందని ఫ్రాన్స్ మంత్రి రాచిడా దాతి వెల్లడించారు. మ్యూజియం సిబ్బంది ఎవరికీ గాయాలు కాలేదన్నారు. దర్యాప్తు కొనసాగుతున్నందున మ్యూజియం మూసివేసామన్నారు. ఒకవైపు మ్యూజియంలో నిర్మాణపనులు జరుగుతున్నాయని, దుండగులు అక్కడినుంచేమ్యూజియంలోపలికి వచ్చారన్నారు. అనంతరం సరుకురవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారని, నెపోలియన్ కాలంనాటి వస్తువులు ఆభరణాలున్న గ్యాలరీ అద్దాలు పగలగొట్టి తొమ్మిది విలువైన వస్తువులు దోచుకునిపోయారని తెలిపారు. గతంలో కూడా అనేకమంది దుండగులు ఆర్ట్‌మ్యూజియంలో చోరీకి ప్రయత్నిం చారు. 1911లో మ్యూజి యంలో లియోనార్డో డావిన్సీ మోనాలిసా చిత్రాన్ని మాజీ కార్మికుడు విన్సెంజో పెరుగ్గియా దొంగిలించాడు. రెండేళ్లపాటు విచారణ జరిపిన అధికారులు ఆతడినుంచి రికవరీచేసారు. 1983 లో మ్యూజియంనుంచి రెండు ప్రాచీన కవచాలు దొంగలించారు. నాలుగుదశాబ్దాల తర్వాత అధికారులు వాటిని గుర్తించారు. మెసపుటోనియా, ఈజిప్టుకు చెందిన అనేక వస్తువులు, వివిధ రాజ్యాలకు సంబంధించినచిత్రాలు, శిల్పాలు వంటివి ఈ మ్యూజియంలో ఉన్నాయి. మోనాలిసా, వీనస్ డిఇలో వింగ్డ్ విక్టరీ ఆఫ్ సమోత్రేస్, వైర్సెల్లెస్ దయానా వంటిప్రముఖ కుద్యాలు ఇందులో ఉన్నాయి. సుమారు 30వేల మందికిపైగా ఈ మ్యూజియంను ప్రతినిత్యం సందర్శిస్తారు. 33వేలకుపైగా కళాకృతులు, కుడ్యచిత్రాలు, విలువైన ఆభరణాలు ఈ పురావస్తుశాలలో భద్రపరుస్తారు. దొంగిలించుకు పోయిన ఆభరణాలు వెలకట్టలేనివని దుండగులు హైడ్రాలిక్ నిచ్చెన సాయంతో అపోలో గ్యాలరీ లోకి వచ్చారని మంత్రి తెలిపారు. అపోలో గ్యాలరీ అంటేనే ఫ్రెంచ్ రాజుల ఆభరణాలు ఉంటాయి. లోపలికి డిస్క్ కట్టర్ ఉపయోగించి ప్రవేశించారు. మొత్తం ఆపరేషన్ కేవలం ఏడే ఏడు నిమిషాల్లో ముగించుకుని వెళ్లిపోయారు. అయితే దొంగిలించిన వాటిలో ఒక ఆభరణం బయట పడేసి ఉండటంతో దాన్నిబట్టి నెపోలియన్ కాలం నాటి ఆభరణాలను దొంగిలించినట్లు తెలుస్తోంది.

## డొనెట్స్క్ మాకిస్తే యుద్ధం ఆపేస్తాం: ట్రంప్‌తో భేటీకి ముందు పుతిన్ డిమాండ్



**వాషింగ్టన్, అక్టోబరు 21 :** ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతమైన దొనెట్స్క్‌ను 11ఏళ్లుగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న రష్యా తాజాగా దీనిని తమకు అప్పగించి తీరాల్సిందేనని పట్టుబడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య గత వారం జరిగిన సుదీర్ఘ ఫోన్‌కాల్ సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు వైట్‌హౌజ్ అధికారులు చెపుతున్నారు. ఇటీవల ఫోన్ కాల్‌లో పుతిన్ ఓ ప్రతిపాదనను ట్రంప్ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. తమ సేనల ఆధీనంలో ఉన్న జపొరిజియా, ఖేర్సాన్ ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు పుతిన్ సానుకూలతను వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు తేలింది. ఈప్రాంతం పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతం, అపారమైన ఖనిజవనరుల నిల్వలున్నాయి. అలాగే బొగ్గుగనులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంపై రష్యా ఎప్పటినుంచో ఫోకస్ పెంచింది. అయితే ఈ డిమాండ్‌పై ట్రంప్‌మౌనం వహించారని సమాచారం. అలాస్కాలో జరిగిన ట్రంప్‌పుతిన్ భేటీతో పోలిస్తే తాజాగా జరిగిన ఫోన్‌కాల్‌లో రష్యా కొంత మెత్తబడినట్లు తెలుస్తోంది. పుతిన్‌తో ఫోన్ కాల్ మాట్లాడిన అదే రోజు ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. నాడు అమెరికా అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో మాత్రం పుతిన్ డిమాండ్లను ప్రస్తావించలేదు. పుతిన్ డిమాండ్లపై ఉక్రెయిన్, ఐరోపా సానుకూలంగా లేనట్లు తెలుస్తోందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఎటువంటి ప్రయోజనం లేకుండానే శరీరంలోని ఓ భాగాన్ని ఇచ్చేసినట్లు ఉందని నిపుణులు అభివర్ణించారు. అయితే ఇప్పటికే ఉక్రెయిన్‌లోని ఐదోవంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించారు. ఇదిలా ఉండగా మరోవైపు ఉక్రెయిన్‌కు సరికొత్త ఆయుధాలు ఇచ్చే విషయంలోనూ అమెరికా ఆచితూచి వ్యవహరిస్తోంది. తోమహాక్ క్రూజ్ క్షిపణులే లక్ష్యంగా అమెరికాకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి నిరాశ ఎదురైంది. డొనాల్డ్ ట్రంప్‌తో శుక్రవారం వాషింగ్టన్‌లో జరిపిన చర్చల్లో తోమహాక్ క్షిపణుల సరఫరాపై అమెరికా తరఫున ఎలాంటి హామీ లభించలేదు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు వెంటనే యుద్ధం ఆపాలన్న ప్రకటనతోనే ట్రంప్ సరిపుచ్చారు. దాదాపు 2500కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సామర్థం గల తోమహాక్‌లను తమకు అమెరికా సరఫరా చేస్తే రష్యా సైనిక లక్ష్యాలపై దాడి చేసి ఆ దేశాన్ని శాంతి ఒప్పందంపై సంతకం చేసేలా ఒత్తిడి తెస్తామని ఉక్రెయిన్ కొద్దికాలంగా చెబుతోంది. ఇటీవల జెలెన్‌స్కీతో ట్రంప్ మాట్లాడుతూ పుతిన్‌కు చివరి హెచ్చరిక ఇస్తానని పేర్కొన్నారు. పుతిన్ నిజంగా శాంతి చర్చలపై సీరియస్‌గా లేనట్లయితే, అమెరికా టొమాహాక్ దీర్ఘశ్రేణి క్షిపణలను ఉక్రెయిన్‌కు ఇస్తుందని జెలెన్‌స్కీకి హామీ ఇచ్చారు. ఇటీవల ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో జర్నలిస్టులతో మాట్లాడిన సందర్భంలో ఈ విషయాన్ని వెల్లడించారు. టొమాహాక్‌ల క్షిపణులు వారి వైపు దూసుకెళ్లాలని రష్యా కోరుకుంటుందని తాను అయితే అనుకోవడం లేదని చెప్పారు. ఒకవేళ ఇదే ఇది యుద్ధంలో కొత్త దశ అవుతుందని తాను జెలెన్‌స్కీకి చెప్పినట్లు పేర్కొన్నారు.



## కోట్లాది రూపాయలు చెల్లించి యువతిని పెళ్లాడిన తాత!

**జకార్తా, అక్టోబరు 21 :** సాధారణంగా పెళ్లికి వయసులో సంబంధం లేదంటుంటారు. అలాంటి వివాహాలను కూడా మనం చాలా చూశాం. ఇదే క్రమంలో టార్మాన్ అనే 74 యేళ్ల వ్యక్తి తన కంటే 50 యేళ్లు చిన్నదైన యువతిని పెళ్లాడాడు. అయితే, ఈ పెళ్లి కోసం ఆ యువతికి ఆ వ్యక్తి ఏకంగా రూ. 2కోట్ల కన్యాశుల్కం (ఎదురు కట్నం) చెల్లించాడు. ఇండొనేసియాలో జరిగిన ఈ వివాహం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అసలేం జరిగిదంటే.. టార్మాన్ (74), అరికా (24)ల వివాహం తూర్పు జావా ప్రావిన్స్‌లోని పాసిటన్ రీజెన్సీలో ఈ నెల 1న జరిగింది. ఈ వివాహం చేసుకునేందుకు గాను టార్మాన్ ఆ యువతికి దాదాపు రూ. 2 కోట్లు చెల్లించాడు. అయితే ఫొటోగ్రాఫర్లకు మాత్రం డబ్బులు ఇవ్వకుండా తప్పించుకున్నారట. పెళ్లి అయిన తర్వాత తమకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకుండా నవదంపతులు అదృశ్యమయ్యారని ఆ సంస్థ ఆరోపించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. ఆ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. వధువుకు తొలుత రూ.60 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ, వివాహ వేడుక సమయంలో ఏకంగా రూ. 1.8 కోట్లు చెల్లించారట. ఇక పెళ్లికి వచ్చిన అతిథులకు కూడా కొంత డబ్బును రిటర్న్ గిఫ్టులుగా ఇచ్చారు. ఈ వేడుకలు ముగిసిన కొద్దిసేపటికే నవ దంపతులు అదృశ్యమ య్యారు. వారిని కాంటాక్ట్ అయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లభించలేదు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించగా టార్మాన్ వివాహం చర్చనీయాంశమైంది. ఇక, ఈ వివాహం వద్దంటూ ఆ యువతిని తాము ముందే హెచ్చరించామని వధువు తరఫు బంధువులు ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. అయిన ప్పటికీ ఆమె తమ మాటలను పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో తమ వివాహంపై వస్తున్న కథనాలపై టార్మాన్ స్పందించారు. వధువుకు డబ్బు చెల్లించిన విషయం నిజమే నని ధ్రువీకరించారు. అయితే, విడిపోయా రంటూ వచ్చిన వార్తలను ఖండించారు. మేము కలిసే ఉన్నామని స్పష్టం చేశారు. ఇదే క్రమం లో వారు హనీమూన్‌కు వెళ్లారంటూ వధువు తరఫు కుటుంబం వెల్లడించింది. ఇక, ఆ సంస్థ చేసిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# సంక్షిప్తంగా..

## భారత్ సరిహద్దుల వరకూ పరిగెత్తిస్తాం: పాక్‌కు హెచ్చరిక



**దోహా, అక్టోబరు 21 :** పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలకు ఇక తెరపడింది. అయితే కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి ముందు పాకిస్థాన్ అఫ్ఘానిస్థాన్‌ల దేశాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆ సందర్భంలో అఫ్ఘానిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మహమ్మద్ నబీ ఒమారి పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రత్యర్థి ఎలాంటి ఆక్రమణకు పాల్పడినా తమ దళాలు వారిని భారత సరిహద్దు వరకు పరిగెత్తిస్తామని ఒమారి వ్యాఖ్యానించారు. పాక్టికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడి పౌరుల ప్రాణాలు తీయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ దేశంలోని సైనిక నాయకత్వాన్ని విమర్శించారు. ఆ దేశ సైనిక పాలన ఇతరుల ఇష్టాలపై ఆధారపడి ఉంటుందని ఒమారి విమర్శించారు. ఇటీవల ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సానుభూతి పరుడిలా మాట్లాడిన వీడియోల గురించి ఆయన ప్రస్తావించారు. కొన్ని రోజులుగా అఫ్ఘాన్‌పాక్ సరిహద్దుల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది.

## ఇండిగో విమానానికి బాంబు బెదరింపు



**దుబాయి, అక్టోబరు 21 :** దుబాయ్ నుంచి మంగుళూరు బయలుదేరిన ఇండిగో విమానంకు ముందుగా బాంబు బెదిరింపు వచ్చింది. ఆ తర్వాత ల్యాండింగ్ సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురైంది. దాంతో అధికారులు ఆ విమానాన్ని దారిమళ్లించారు. ఆదివారం తెల్లవారుజామున దుబాయ్ నుంచి మంగళూరుకు వెళ్లాల్సిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు సందేశాలు ఉండటాన్ని ప్రయాణికులు గుర్తించారు. వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విమానాశ్రయ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అది ఆకతాయిల బెదిరింపుగా అధికారులు ధ్రువీకరించారు. ఆ తర్వాత విమాన ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:25 గంటలకు బయలుదేరాల్సిన విమానం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

## ఒకే వేదికపై ప్రేమించిన ఇద్దరినీ పెళ్లాడిన యువకుడు..



**చిత్రదుర్గ, అక్టోబరు 21 :** కర్ణాటకలోని చిత్రదుర్గలో ఓ అరుదైన, వింత వివాహం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకే యువకుడు తాను ప్రేమించిన ఇద్దరు యువతులను ఒకేసారి, ఒకే వేదికపై పెళ్లి చేసుకుని స్థానికంగా చర్చనీయాంశంగా మారాడు. కుటుంబసభ్యుల పూర్తి అంగీకారంతో ఈ వివాహం జరగడం మరో విశేషం. చిత్రదుర్గ పట్టణంలోని జేజేహట్టి కాలనీకి చెందిన వసీం షేక్ (28) అనే యువకుడు ఇద్దరు యువతులతో ప్రేమాయణం నడిపాడు. సుమారు 13 ఏళ్ల క్రితం గోవాలో పనిచేస్తున్నప్పుడు షిఫా అనే యువతితో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఆ తర్వాత ఏడేళ్ల క్రితం చిత్రదుర్గకు చెందిన జన్నత్ అనే యువతితో కూడా వసీంకు పరిచయమై, ఆమెతోనూ ప్రేమలో పడ్డాడు. ఇద్దరినీ ఇష్టపడిన వసీం, ఎవరినీ వదులుకోలేకపోయాడు. ఈ క్రమంలో ఇద్దరినీ వివాహం చేసుకోవాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు. తన మనసులోని మాటను ఇరువైపులా కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత మూడు కుటుంబాల పెద్దలు కూర్చుని చర్చించుకుని ఈ పెళ్లికి అంగీకారం తెలిపారు.

## బెయిల్ బాండ్లు సమర్పించలేని ఖైదీలకు సుప్రీం కొత్త ఉత్తర్వులు

**జిల్లా న్యాయసేవాధికార సంస్థద్వారా ప్రభుత్వమే వారికి జమచేయాలన్న సూచన**

**న్యూఢిల్లీ, అక్టోబరు 21 :** దేశంలో జైళ్లలో మగ్గిపోతున్న విచారణలో ఉన్న పేద ఖైదీలకు సుప్రీం కోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన నిందితులు బెయిల్ మంజూరు అయినప్పటికీ డబ్బులు లేక బెయిల్ బాండ్లు సమర్పించలేకపోవడంతో జైలులోనే ఉండిపోతున్న నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం కొత్త నిర్ణయం ప్రకటించింది. ఏదైనా నేరం చేసి ఒక పేద వ్యక్తి అరెస్ట్ అయి, విచారణ ఖైదీగా జైలులో ఉండి బెయిల్ కోసం ష్యూరిటీ మొత్తం సమర్పించలేని పరిస్థితిలో ఉంటే సంబంధిత ప్రభుత్వం జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా విడుదలకు అవసరమైన మొత్తాన్ని అందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ మేరకు ఒక ప్రత్యేకమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్‌వోపీ)రూపొందించింది. అమికస్ క్యూరీ సూచనలను చేర్చిన తర్వాత సుప్రీంకోర్టు కొత్త ఎస్‌వోపీ రూపొందించింది. వేలాది మంది విచారణలో ఉన్న ఖైదీలు బెయిల్ మంజూరు అయినప్పటికీ బెయిల్ బాండ్లను సమర్పించకపోవడం (ష్యూరిటీతో కూడిన, షూరిటీ లేకపోయిన) వల్లే జైలులో మగ్గుతున్నారని తెలుసుకున్న సుప్రీం ధర్మాసనం ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుంది. అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సూచనలను చేర్చిన తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్‌సీ శర్మల ధర్మాసనం కొత్త ఈ కొత్త ఎస్‌వోపీని సిద్ధంచేసింది. జిల్లా న్యాయ సేవల సంస్థ (డీఎల్ ఎస్‌ఏ) రూ.లక్ష వరకు పూచీకత్తు మొత్తాన్ని సమర్పించవచ్చని అయితే ట్రయల్ కోర్టు సమర్పించాల్సిన ష్యూరిటీ రూ. 1 లక్ష కంటే ఎక్కువగా నిర్ణయించినట్లయితే, ఆ మొత్తాన్ని తగ్గించడానికి దరఖాస్తును దాఖలు చేయాలని ధర్మాసనంపేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా విచారణలో ఉన్న ఖైదీకి బెయిల్ మంజూరు అయినప్పటికీ ఏడు రోజుల్లోపు జైలు నుండి విడుదల కాకపోతే, జైలు అధికారులు డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శికి తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి వెంటనే ఆ ఖైదీ సేవింగ్స్ అకౌంట్‌లో నిధులు ఉన్నాయో లేదో ధ్రువీకరించడానికి ఒక వ్యక్తిని నియమిస్తారు. అయితే నిందితుడి వద్ద డబ్బు లేనట్టుగా తేలితే జిల్లా స్థాయి సాధికార కమిటీ నివేదిక అందిన తేదీ నుంచి ఐదు రోజుల వ్యవధిలోపు డీఎల్‌ఎస్‌ఏ సిఫార్సుపై పూచీకత్తు కోసం నిధులను విడుదల చేయమని నిర్దేశిస్తుంది. విచారణలో ఉన్న ఖైదీకి పేద ఖైదీలకు మద్దతు పథకం కింద ఆర్థిక సహాయం ప్రయోజనాన్ని అందించాని సాధికార కమిటీ సిఫార్సు చేసిన కేసులకు, ఒక ఖైదీకి రూ. 50,000 వరకు అవసరమైన మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా ఏదైనా ఇతర సూచించిన పద్ధతి ద్వారా డ్రాచేసి సంబంధితకోర్టుకు అందుబాటులో ఉంచాలని ఆదేశించవచ్చని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

## బయలుదేరే ముందు సర్వీసు రద్దుచేసిన ఎయిరిండియా

**మిలాన్, అక్టోబరు 21 :** స్వదేశానికి వెళ్లి తమ వారితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని అంతా అనుకుంటున్న కొన్ని గంటలకే భారత్ వెళ్లే విమాన సర్వీస్ రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా సంస్థ ప్రకటించింది. ఈనెల 17వ తేదీన ఇటలీలోని మిలాన్ నగరం నుంచి 256 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బందితో ఏఐ 138 విమాన సర్వీసు న్యూఢిల్లీకి బయలుదేరాల్సి ఉంది. చివరి నిమిషంలో ఈ విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనిపై ఎయిర్ ఇండియా స్పందించింది. విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడిందని తెలిపింది. ప్రయాణికులు, విమాన సంస్థ సిబ్బందికి భద్రత కల్పించడానికే తాము తొలి ప్రాధాన్యత ఇస్తామని అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

## అంతరాయం లేని సాగు నీటి సరఫరా జరగాలి



- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్
- వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో సాగునీటి కాలువలు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగు నీటి కాలువలు క్రింద ఉన్న తాగునీటి చెరువులను నింపుటకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని భారీ సాగు నీటి కాలువలు కే డబ్ల్యు డెల్టా, గుంటూరు కెనాల్స్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు సత్తెనపల్లి, లింగాయపాలెం బ్రాంచ్ కాలువల పరిధిలోని సాగు భూముల విస్తీర్ణం, వరదనీటి డ్రైయిన్లు వివరాలను మ్యాప్ లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలువల నిర్వహణ, మరమ్మత్తులు, అభివృద్ధికి మంజూరు చేసిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను వెంటనే పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. కెనాల్స్ లో పూడికతీత, నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా నిరంతరం అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటరత్నం, ఈఈ రమేష్, డ్రైయినేజ్ విభాగం డీఈ ధనలక్ష్మి, ఏఈలు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా నుండి కార్తీకమాసం ప్రత్యేక యాత్ర సేవలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**పల్నాడు జిల్లా ఆర్టీసీ కార్తీకమాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పంచరామ క్షేత్రాలు, మహానంది, యాగంటి, శ్రీశైలం మరియు ఇతర ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక యాత్ర బస్సు సేవలను ఏర్పాటు చేసింది. జిల్లా పరిధిలోని 6 డిపోల నుండి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులతో ఈ సేవలు నడపబడుతున్నాయి. ఈ బస్సులలో శుభ్రమైన సీటింగ్, ఆన్‌లైన్ రిజర్వేషన్, సురక్షిత ప్రయాణ వాతావరణం వంటి సౌకర్యాలు కల్పించబడ్డాయి.

ప్రతి కార్తీక సోమవారం పంచరామ క్షేత్రాల దర్శనానికి ఆదివారం సాయంత్రం అన్ని డిపోల నుండి బస్సులు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా, కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం క్షేత్ర దర్శనం కోసం కాణిపాకం, అలమేలుమంగాపురం, శ్రీకాళహస్తి, శ్రీనగర్ గోల్డెన్ టెంపుల్ (కంచి)లకు ప్రత్యేక బస్సు సేవలు నడపబడతాయి. శబరిమల యాత్రికుల కోసం స్పెషల్ హైర్ పద్ధతిలో అందుబాటు ధరలలో బస్సులు ఏర్పాటు చేయబడతాయి.

భక్తులు సమీప బస్ స్టేషన్లలో రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకొని, ఈ ప్రత్యేక యాత్ర బస్సుల ద్వారా సురక్షితంగా శైవ క్షేత్రాలను దర్శించుకోవాలని పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి సూచించారు.

## క్రీడలలో ప్రతిభ చాటిన కొండపాటూరు విద్యార్థులు



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు వారు నిర్వహించిన మండల స్థాయి పలు క్రీడా పోటీలలో కొండపాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కెన్నెడీ తెలిపారు. జడ్పీ స్కూల్ నందు విద్యార్థులను ఎం ఈ ఓ కెన్నెడీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ అధికారి కెన్నెడీ మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో కొండపాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ఖో ఖో పోటీలో 6 వ తరగతి విద్యార్థులు పూజిత, లక్ష్మి తులసి, వాలీ బాల్ పోటీలో 9 వ తరగతి విద్యార్థులు వరబాబు, కబడ్డీ పోటీలో 8 వ తరగతి విద్యార్థి లోకేష్, 9 వ తరగతి విద్యార్థి నరేష్, గెలుపొంది మండల స్థాయిలో ఎంపికయి పెనుమాక నందు డివిజన్ స్థాయిలో జరిగే క్రీడా పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది ప్రకాశరావు, షేక్. షర్మిల, రాజశేఖర్, రవి కుమార్, పోతురాజు, వెంకటేశ్వర్లు, ప్రమీల, రాజేశ్వరి, స్వామి అయ్యప్ప, రాజేష్, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం 'మహిళా గ్రీవెన్స్ డే



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు వెళు తున్నామని,ఇందులో భాగంగానే ప్రతి మంగళవారం 'మహిళా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 'మహిళా గ్రీవెన్స్ డేను నిర్వహించి, వారి నుండి వినతి పత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ప్రధానంగా కోబాల్డ్ పేట 6వ లైన్ లో పీకల వాగు మీద అక్రమంగా ఇల్లు నిర్మించుకోవటం వలన మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా ఉండటం వలన ఈ మురుగు నీరు తమ ఇళ్ళలోకి చేరుతుందని, దీని చర్యలు తీసుకోవాలని కొంతమంది మహిళలు వినతిపత్రం అందజేశారు. అదే విధముగా కొంతమంది విభిన్న ప్రతిభావంతులు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు, కన్నావారితోటలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆషా అనే మహిళా తానూ సైబర్ నేరగాళ్ల బారిన పడి సుమారు రూ. 60 వేలు మోసపోయానని, అదే విధముగా కొంతమంది తమ వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వటం లేదని తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ సమాజంలో మహిళలు తరచుగా చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉంటారు. వారికోసం ఒక ప్రత్యేక రోజు, ఒక సమస్యలను వినిపించే వేదిక అవసరం ఉంది. మహిళల సమస్యలు పరిష్కరించటమే నమ్మకాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఒక మహిళా ప్రజా ప్రతినిధిగా, మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం నా బాధ్యతగా భావిస్తున్నాను. అందుకే ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా 'మహిళా గ్రీవెన్స్ డే' నిర్వహిస్తూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలు వివిధ రకాల సమస్యలతో ముందుకు వస్తున్నారని, ముఖ్యంగా కుటుంబ వివాదాలు, మోసాలు, చైన్ స్నాచింగ్‌లు, సైబర్ క్రైమ్స్ వంటి విషయాలలో వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందజేసి పరిష్కారం తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళా ఆరోగ్య సంరక్షణ, ఎంపవర్మెంట్ దిశగా కూడా పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. "ప్రతి డివిజన్‌లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళల ఆరోగ్యంపై దృష్టి పెడ్తున్నాం. అలాగే వివిధ కంపెనీలు, విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నాము. మహిళా స్వావలంబన కోసం ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేసే దిశగా కూడా చర్చలు కొనసాగుతున్నాయి," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, తమ సమస్యలకు సమాధానం లభిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మహిళల సమస్యలు తీరినప్పుడు, వారి చిరునవ్వు చూడటం నా నిజమైన విజయం," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## పోలీస్ అధికారులకు ఉమేష్ చంద్ర ఆదర్శం డిఎస్పీ బి.జనార్ధనరావు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** విధి నిర్వహణలో అంకితభావం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణ త్యాగానికైనా వెనుకాడని పోరాట పఠిమగల ఉమేష్ చంద్ర ఐపీఎస్,పోలీసు వ్యవస్థకు ఆదర్శమని డీఎస్పీ బి జనార్ధన్ రావు. పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా పేర్కొన్నారు.

స్థానిక చెంచుపేటలోని ఉమేష్ చంద్ర ఐపీఎస్ విగ్రహం సెంటర్లో మంగళవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం డీఎస్పీ బి జనార్ధన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పీ బి. జనార్ధనరావు,పట్టణ పోలీస్ అధికారులు ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డిఎస్పీ, బి. జనార్దన్ రావు మాట్లాడుతూ 1959 లో చైనా,యుద్ధసమయంలో, పదిమంది పోలీసుల అమరులు అయ్యారని, అప్పటినుండి పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని అక్టోబర్ 21వ, తేదీన, నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి ఉమేష్ చంద్ర, 1999లో, విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించి, నక్స్ లైట్స్ ఘాతుకానికి అసువులు బాసారని, వారి ధైర్యసాహసాలు, విధి నిర్వాహణలో చూపె, అంకిత భావం పోలీస్ వ్యవస్థకు ఆదర్శమన్నారు. త్రీ టౌన్ సి ఐ, ఎస్. సాంబశివరావు మాట్లాడుతు పోలీస్ అమరవీరుల సంస్మరణ వేళ, శాంతి భద్రతల పరిరక్షణలొ, నక్స్ లైట్స్ పన్నాగంలో ప్రాణాలర్పించి, ఉమేష్ చంద్ర ఐపిఎస్ తమకు ఆదర్శమన్నారు. వారి బాటలొ విధి నిర్వాహణలొ సాగుతున్నామని, శాంతి భద్రతల రక్షణ కోసం ప్రాణత్యాగానికైన సిద్దమేనని అన్నారు. ఈకార్రక్రమంలొ వన్ టౌన్ సి ఐ, వి. మల్లిఖార్జునరావు, పట్టణ ఎస్సై లు, సిబ్బంది ఉన్నారు.

## అమరవీరుడు రాజేష్‌కు నివాళి



- ఆర్మీ జవానులు శ్రీనివాసులు సత్య సాయి

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** తెదేపాసీనియర్ నాయకులు శ్రీయపురెడ్డి శ్రీనివాసులురెడ్డి పెంచల రెడ్డి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి పల్లె నారాయణ చలపతి ఎంఈఎఫ్ మండల అధ్యక్షులు కొడవటిగంటి గురవయ్య తోపాటు వీర జవాన్ రాజేష్ కుటుంబ సభ్యులు ఆయన తల్లిదండ్రులు సతీమణి స్వాతికి వస్త్రాలను కలికిరి 53వ బెటాలియన్ అన్నమయ్య జిల్లా జవానులు శ్రీనివాసులు సత్య సాయి రాజేష్ విగ్రహానికి పూలమాల లేచి నివాళులర్పించి ఆమెకు వస్త్రధానాన్ని అందజేశారు. అనంతరం తెదేపా సీనియర్ నాయకులు శ్రీ యపురెడ్డి శ్రీనివాసులురెడ్డి పెంచల రెడ్డి తో కలిసి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నారాయణ చలపతి ఎం ఈ ఎఫ్ మండల అధ్యక్షులు కొడవటికంటి గురవయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సగిలి ఆంథోని మున్నెల్లి గురు ప్రసాద్ తో పాటు అమరవీరుడు రాజేష్ కుటుంబ సభ్యులు కలిసి ఆర్మీ జవాన్లకు ఘన సన్మానం చేశారు.

## అభివృద్ధి పథంలో ప్రగతి నగర్ : ఎమ్మెల్యే నసీర్

- ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు
- త్వరలో రోడ్ల నిర్మాణం చేపడతాం
- జీవో 30 ద్వారా పేదల గృహాల రెగ్యులరైరేషన్
- కోటి రూపాయలతో పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**సంక్షేమ పథాన అభివృద్ధి పథంలో కూటమి పాలన సాగుతోందని, ప్రగతి నగర్ రూపురేఖలు మారుస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రగతి నగర్ లో రూ. 40 లక్షలతో పైపులైన్లు, కొండయ్య కాలనీలో రూ. 60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రగతి నగర్ గత ప్రభుత్వంలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి నగర్ పై దృష్టి సారించానని చెప్పారు. ఇక్కడ 18 లైన్లకు కేవలం రెండు బోర్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అమృత్ పథకంలో భాగంగా రూ. 40 లక్షలతో మంచినీటి పైపులైన్లు నిర్మించబోతున్నామని వెల్లడించారు. ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించనున్నామని తెలిపారు. వీటితోపాటు రోడ్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని, నిధులు కూడా మంజూరయ్యాయని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జీవో నంబర్ 30 ద్వారా ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల నివాసాలను రెగ్యులరైజేషన్ చేయనున్నామని తెలిపారు. ప్రగతి నగర్ లో ఉన్న 840 మంది పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అన్ని ప్రాంతాల్లో ఏ అవసరం వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామని, గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్ గా తీర్చదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

**పోలీసు అమరుల త్యాగం చిరస్మరణీయం: ఎమ్మెల్యే నసీర్**

ప్రజాస్వామ్య పరిరక్షణే పరమావధిగా, సమాజ శ్రేయస్సే ఊపిరిగా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించే పోలీసు అమర వీరుల త్యాగం చిరస్మరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు అమవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్యే నసీర్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రతి రోజూ ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే, పోలీసులు తాము నిద్రలేని రాత్రులు గడిపి తమను రక్షిస్తుంటారని తెలిపారు. అసాంఘిక కార్యక్రలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రతినిత్యం విధి నిర్వహణలో తలమునకలవుతారని స్పష్టం చేశారు. కుటుంబానికి దూరం సమాజం కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతుననామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాల విక్రయాలు పెరిగాయని, దీంతో నేరాలకు అడ్డు ఉండేదని కాదని చెప్పారు. ప్రస్తుతం ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న పోలీసు వారికి ఈ సందర్భంగా సెల్యూట్ చెప్పారు.

## లూలుకి కేటాయించిన భూములను రద్దు చేయాలి

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** లూలు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు విశాఖపట్నంలో బీచ్ రోడ్డు లో హర్బర్ పార్క్ లో కేటాయించిన 13.74 ఎకరాలు, విజయవాడ నడిబొడ్డులో ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల భూమిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 21వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఇటీవల గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో సర్దార్ పటేల్ రింగ్ రోడ్ వద్ద ఉన్న 66 వేల 168 చదరపు మీటర్ల స్థలం దాదాపు 16.35 ఎకరాలను లు లు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ ప్రైవేట్ లిమిటెడ్ వేలంలో 519.41 కోట్లకు, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో లూలు సంస్థ దాదాపు 4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమౌతుందని గుజరాత్ లో లులు హైపర్ మార్కెట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, సూరత్ లో ఎగుమతులను ప్రోత్సహించే కార్యక్రమాలకు లులు సంస్థ సంసిద్ధతను వ్యక్తం చేసినా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఒక సెంటు భూమిని కూడా కేటాయించ లేదన్నారు. లులు సంస్థ ఆంధ్రప్రదేశ్ లో 1000 కోట్ల రూపాయలు విశాఖ, విజయవాడలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడితే 1000 కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన భూములను దారాదత్తం చేస్తుందని వివరించారు.

గత 16 నెలలుగా వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని సంవత్సరానికి 9 లక్షల కోట్లకు పైగా లాభాలను గడిస్తున్న గూగుల్ సంస్థలకు 22 వేల కోట్ల రూపాయల విలువ గల రాయితీలను ప్రకటించందని మరోవైపు 5 వేల కోట్ల రూపాయల పెట్టుబడిని పెట్టలేని దీనస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెబుతూ 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో కార్పొరేట్ ఆసుపత్రులకు కట్టపెట్టాలని చూస్తుందన్నారు. అతి కొద్ది మందికి మాత్రమే అతి తక్కువ వేతనాలు కలిగిన ఉద్యోగాలను కల్పిస్తున్న లులు సంస్థకు 1000కోట్ల రూపాయల పైగా విలువ గల భూములను 99 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం అర్థరహితమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గత ఉత్తర్వులను రద్దుచేసి గుజరాత్ మాదిరిగా బహిరంగంగా వేలం వేసి భూములను కేటాయించాలని ప్రజల సంపదను, ప్రజల వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా బదలాయించే విధానానికి స్వస్తి పలకాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

## శవ రాజకీయాలు చేస్తున్న వైకాపా : జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె విమర్శ

- కూటమి నేతల మధ్య మధ్య విభేదాలకు వైకాపా కుట్ర



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు లాడ్జి సెంటర్లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం. విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజుల క్రితం కందుకూరు నియోజకవర్గం, గుడ్లూరు మండలంలో దారకానిపాడు గ్రామంలో జరిగిన దుస్సంఘటనను ఎవరు క్షమించకూడదని అన్నారు. ఆ చర్యకు పాల్పడిన వ్యక్తిని నిట్ట నిలువునా చంపేసిన తప్పులేదని అన్నారు. అలాంటి చర్యలను ఎవరూ సమర్థించ రని ఇంత నానా యాగి చేసి కులాలకు పార్టీల వృద్ధాలను చూస్తున్న వైసిపి నాయకులు ఎవరైనా దమ్ముంటే కోర్టులు, పోలీస్ స్టేషన్లతో పనిలేకుండా అతని నిట్ట నిలువునా చంపేయాలని ఎజెండాతో వచ్చే దమ్ము ఎవరికైనా ఉందా అని సూటిగా ప్రశ్నించారు. అలా కాకుండా ఆ విషయం అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలని, పార్టీలకు రుద్దాలని, కుల గొడవలు పెట్టాలని చూస్తే ప్రజలు అంతకు ముందుకు లాగా అమాయకులు కాదని, వైసిపి నాయకులను తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు. గత వైసిపి పాలనలో దళితులు, బీసీ లపై, ఇతర కులాలపై వారు చేసిన దాష్టికాలు అంతా ఇంత కాదని, ఈరోజు అధికారం పోయేసరికి వారికి అలవాటైన శవరాజకీయాలు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. శవరాజకీయం వైసిపి పార్టీ డిఎన్ఏ లోనే ఉందని అన్నారు. అలాగే తాడేపల్లి నుండి విడతల వారీగా వైసిపి నాయకులను పంపి రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటీవల వైసీపీ నాయకులు అంబటి రాంబాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఈ విషయం మీద స్పందించలేదని చెప్పడం ఆయన బాధ్యత వహించాలని చెప్పడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. కుల రాజకీయాలు గురించి మాట్లాడుతున్న అంబటి రాంబాబు కనీసం మీకు మాట్లాడ్డానికి కనీస నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. గతంలో ఒక బీసీ కులానికి చెందిన ఒక వ్యక్తి మురికి కుంటలో పడి చనిపోతే, వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన మొత్తంలో సగం వాటా అడిగినా ప్రబుద్ధుడివి నీవు అని అన్నారు. అలాంటి నువ్వు కూడా పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడడం ఏంటని అన్నారు. మైనింగ్ దగ్గర్నుంచి సత్తెనపల్లిలో అంబటి చేసిన అరాచకాల సంగతి త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని, వాడికి మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే మరొక నాయకుడు జక్కంపూడి రాజా గతంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేశారని, ఆ పని చేసిన సమయంలో ఏ కొద్ది మొత్తంలోనైనా కులానికి ఉపయోగపడ్డావా నువ్వు అని, ఒకవేళ ఉపయోగపడితే చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అధికారం ఉన్నన్నాళ్లు కన్ను మిన్ను కనరాకుండా, ఈరోజు అధికారం పోయేసరికి కులం గుర్తుకు వచ్చి కులం మీద కపట ప్రేమ చూపించి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. అలాగే మరొక వ్యక్తి వంగవీటి నరేంద్ర కూడా ఇంటి పేరు అడ్డం పెట్టుకొని, తనను తాను పెద్ద నాయకుడు లాగా భావిస్తూ పవన్ కళ్యాణ్ మీద నిందలు మోసే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. ఇంటి పేరు ఉన్నంత మాత్రాన నాయకులు అయిపోరని, అందుకు తగ్గట్టుగా ప్రవర్తిస్తేనే ప్రజలు ఆదరిస్తారని ఆ విషయాన్ని గుర్తు పెట్టుకొని ప్రవర్తిస్తే బాగుంటుందని అన్నారు. అలాగే తోట త్రిమూర్తులు లాంటి పెద్దలు కూడా ఈ విషయం మీద స్పందించిన తీరు, సరిగా లేదని, వ్యక్తిగత గొడవను తీసుకువచ్చి కులాలకు పార్టీలకు ముడి పెట్టే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. అలాగే చనిపోయిన బాధితుడు భార్య తాము మొదటి నుండి తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులమని చెప్పినప్పటికీ, పవన్ కళ్యాణ్ ని ఈ విషయంలో లాగే ప్రయత్నం వైసిపి నాయకులు చేస్తున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ స్పందించలేదని చెప్పడం చాలా హాస్యాస్పదంగా ఉందని, స్పందించాల్సింది ప్రభుత్వం అని, ఇప్పటికే ప్రభుత్వం స్పందించి అన్ని విధాలుగా బాధితులకు , బాధితుల కుటుంబాలకి న్యాయం చేసే విధంగా చూస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ఇటీవల మంత్రులు వంగలపూడి అనిత , నారాయణ జనసేన పార్టీ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కూడా వెళ్లి వారిని పరామర్శించడం జరిగిందని అన్నారు. జనసేన పార్టీ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మరొక ముందడుగు వేసి తన సొంత నిధులను వారి కుటుంబం నష్టపరిహారంగా చెల్లించిన విషయాన్ని మరొకసారి గుర్తు చేశారు. అలాగే సాయం అనేది జనసేన పార్టీ విధానమని, పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టిన సమయంలో పార్టీ కోసం పెట్టిన ఏడు సిద్ధాంతాలలో ప్రథమ సిద్ధాంతం కులాలను కలిపే ఆలోచన విధానం అని చెప్పి అన్నారు. ఆ విధానంతోనే పవన్ కళ్యాణ్ గారు పార్టీ నడుపుతున్నారని, అదే వైసీపీ పార్టీ వాళ్లకి మీ సిద్ధాంతమే ఏంటి అని అడిగితే శవ రాజకీయం అని చెప్పే పరిస్థితి ఉందని చెప్పి అన్నారు. పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టింది ఒక కులం కోసం కాదని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ కూడా సుభిక్షంగా ఉండాలని, ఆ దిశగా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ కూడా ఈ విషయాలన్నిటిని గమనించి, పవన్ కళ్యాణ్ కి ,కూటమికి అండగా నిలబడాలని చెప్పి కోరారు.

అలాగే సీనియర్ నాయకులు చందు సాంబశివరావు మాట్లాడుతూ జరిగిన హత్యను ఎవరు సమర్థించబోరని, చట్ట ప్రకారం నిందితులకు పడాల్సిన శిక్షపడి తీరుతుందని, అదేవిధంగా బాధితులకు రావాల్సిన నష్టపరిహార విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. వైసిపి నాయకులు జగన్ రెడ్డి చేతిలో పాములుగా మారారని, ఆ విషయాన్ని గమనించి ఎక్కడికైనా వచ్చేటప్పుడు తమ వెంట ఒక నలుగురిని అయినా తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. అలా కాకుండా జగన్ రెడ్డి ఒక షెడ్యూల్ ఇస్తే ఆ షెడ్యూల్ ప్రకారం మీడియా ముందుకు వచ్చేసి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు ఎవ్వరు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వ్యక్తిగత గొడవలను కులాలకు పార్టీలకు రుద్దే ప్రయత్నం మానుకోవాలని చెప్పి సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు, జిల్లా కార్యదర్శిలు చట్టాల త్రినాథ్, నక్కల వంశీ, కార్పొరేటర్ ఎర్రం శెట్టి పద్మావతి, నాయకులు మధులాల్, లింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరాల నిర్వహణపై ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**ఆంధ్రప్రదేశ్ లో జూదం ఆడటం, జూద కేంద్రాలు నిర్వహించడం, ప్రోత్సహించడం నేరం. ఆన్లైన్ లేదా ఆఫ్ లైన్ లో వీటిని నిర్వహించినా, ఆడినా ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ – 1974 ప్రకారం శిక్షార్హులు అవుతారు అని చట్టం చెబుతోంది. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జూద కేంద్రాలు సాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. పేకాట క్లబ్బుల నిర్వహణపై ఆ ఫిర్యాదుల్లో తెలిపారు. కొందరు పెద్దలు పేకాట కేంద్రాలను నిర్వహిస్తూ, నెలవారి మామూళ్లను అధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు, పోలీసు అధికారులకు దీనిపై ఉన్న సమాచారం తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు దీనిపై ఆరా తీశారు. ఒకవేళ పోలీసు అధికారుల దృష్టికి వచ్చిన వివరాలు, దానిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు రాష్ట్ర డీజీపీకి స్పష్టం చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# యూజర్ ఫ్రెండ్లీగా పౌర సేవలు



- ప్రభుత్వ శాఖల సమాచారం కోసం అందుబాటులోకి ఏపీ సెర్చ్ బార్
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు సమర్థంగా ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని సీఎం సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, సంక్షేమ పథకాలపై సీఎం చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సేవలు అందాలని, దీనికోసం టెక్నాలజీ సాయాన్ని తీసుకోవాలని సూచించారు. సమర్థంగా పౌర సేవలు అందినప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని సీఎం అన్నారు. ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారాన్ని డేటా అనలటిక్స్ తో విశ్లేషించుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు అందిస్తున్న సేవల విషయంలో టెక్నాలజీ ఆడిటింగ్ కూడా నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. వీటితో పాటు మంత్రులు, అధికారులు ఫైళ్ల క్లియరెన్సుకు ఎంత సమయం తీసుకుంటున్నారన్న అంశాన్ని కూడా బేరీజు వేస్తామని సీఎం తెలిపారు. తద్వారా ఏ స్థాయిలో ఎక్కువ ఫైళ్లు ఉండిపోతున్నాయన్న వివరాలను తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక సహా వివిధ సేవలు అందిస్తున్న వెబ్ సైట్లు, యాప్ లు ప్రజలకు సులభంగా సేవలందించేలా తీర్చిదిద్దాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని డేటా లేక్ ద్వారా త్వరలోనే అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, భూగర్భ జలాలు ఇలా వేర్వేరు రకాలుగా సేకరిస్తున్న సమాచారాన్ని సమర్థంగా వినియోగించుకోవటం ద్వారా ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని తగ్గించాల్సి ఉందని ముఖ్యమంత్రి సూచించారు.

టెక్నాలజీ వల్ల వచ్చే ప్రయోజనంతో పాటు డేటా విశ్లేషణ ద్వారా ఫలితాలను అంచనా వేయాలని సీఎం సూచించారు. ఏపీలో ఇప్పటి వరకూ 2.10 లక్షల గంటల మేర డ్రోన్ల వినియోగం జరిగిందని... 77 శాతం మేర వ్యవసాయ అవసరాలకు వినియోగించిన రీత్యా రైతులకు ఎంతమేర వ్యయం తగ్గింది.. అధిక పురుగుమందుల వినియోగం ఏమేరకు తగ్గించారన్న విషయాన్ని కూడా అంచనా వేయాలన్నారు. నేరాల నియంత్రణ, విచారణల్లో సీసీ కెమెరాల వినియోగం ఎంతమేర జరుగుతుందన్న అంశంపైనా సీఎం ఆరా తీశారు.

అవేర్ వంటి సాంకేతికత వ్యవస్థ ద్వారా ప్రకృతి విపత్తులతో పాటు వివిధ అంశాల్లో సేకరిస్తున్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై కూడా సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీ ప్రభుత్వంలోని ఏ శాఖ సమాచారం అయినా ప్రజలు తెలుసుకునేందుకు ఏపీ సెర్చ్ బార్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సీఎంకు అధికారులు వివరించారు.

# పవన్ కల్యాణ్ ఆదేశిస్తే తప్పేంటి?



- డీఎస్పీ వివాదంపై హోంమంత్రి అనిత స్పందన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. డీఎస్పీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పవన్ కల్యాణ్ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి నివేదిక కోరారు. దీనిపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందిస్తూ "డిప్యూటీ సీఎం ఆదేశిస్తే తప్పేంటి?" అంటూ స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలు: భీమవరం పోలీస్ సబ్ డివిజన్‌లో డీఎస్పీ జయసూర్య ప్రవర్తనపై పలు ఫిర్యాదులు రావడంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా ఆరా తీశారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. డీఎస్పీ పేకాట శిబిరాలు ప్రోత్సహిస్తున్నారని, సివిల్ వివాదాలలో జోక్యం చేసుకుంటున్నారని, అలాగే కొంతమంది నేతల పేర్లను రాజకీయంగా వాడుతున్నారనే ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పోలీసు అధికారులెవరూ చట్ట విరుద్ధమైన వ్యవహారాలకు అండగా ఉండకూడదనేది పవన్ ఉద్దేశం.


కూటమి నేతల ఫిర్యాదులు: డీఎస్పీ జయసూర్యపై ఎక్కువగా ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు పంపించారు. దీంతో పవన్ కల్యాణ్ జిల్లా ఎస్పీకి కాల్ చేసి, "వాస్తవాలపై పూర్తి నివేదిక పంపండి" అని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడడం, చట్టం అమలు చేయడం పోలీసుల బాధ్యత. సివిల్ వివాదాల్లో తలదూర్చడం సరికాదని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అదే విధంగా భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణలను హోంమంత్రికీ, డీజీపీకి తెలియచేయాలని తన కార్యాలయ అధికారుల్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు.

హోంమంత్రి స్పందన: ఈ అంశంపై హోంమంత్రి వంగలపూడి అనితను విలేకరులు ప్రశ్నించారు. ఆమె స్పందిస్తూ, "డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు ఇస్తే అందులో తప్పేముంది?" అని ప్రశ్నించారు. "మంత్రుల మధ్య సమన్వయం ఉంటే ఓ వర్గం మీడియాకు బాధ ఎందుకు అవుతోంది?" అని ప్రశ్నించారు. "మాకు లేని ఇబ్బందులు కొంతమంది మీడియా వర్గాలకు ఎందుకు?" అని అనిత నిలదీశారు.

"నేను ఇతర శాఖల అంశాలు నా దృష్టికి వస్తే సంబంధిత మంత్రికి తెలుపుతాను. అలాగే పవన్ కల్యాణ్ కూడా డీఎస్పీ వ్యవహారాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. అని చెప్పారు. "ప్రభుత్వంలో ప్రతీ శాఖ పరస్పర సహకారంతో పని చేయాలి. మంత్రులు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి, తగిన విధంగా సూచనలు ఇవ్వడం తప్పు కాదు. ప్రజల ఫిర్యాదులపై స్పందించడం కూడా ప్రభుత్వ బాధ్యతే" అని అన్నారు.

"మేమంతా సమన్వయంతో పని చేస్తున్నాం. ఒక శాఖలో సమస్య వస్తే మరో శాఖ దృష్టికి తీసుకురావడమే పరిపాలనా వ్యవస్థ. దీనిని రాజకీయం చేయడం సరికాదు" అని మంత్రి అనిత స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ సూచనలు, హోంమంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీశాయి.

# యూఏఈకి సీఎం చంద్రబాబు



- పెట్టుబడుల సాధనకు ముఖ్యమంత్రి మూడు రోజుల పర్యటన
- పారిశ్రామిక వేత్తలతో రోడ్ షో, తెలుగు డయాస్పొరా సమావేశాల్లో పాల్గొననున్న చంద్రబాబు
- విశాఖ సమ్మిట్‌కు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్న ముఖ్యమంత్రి
- యూఏఈలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో భేటీ
- 3 రోజుల్లో 25 సమావేశాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ ప్రతినిధుల్ని ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సింగపూర్ దేశంలో గతంలో పర్యటించిన ముఖ్యమంత్రి బృందం.. ఇప్పుడు యూఏఈకి వెళ్లనుంది. నవంబరు 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం సీఎం దుబాయ్ లో రోడ్ షో నిర్వహించనున్నారు. అలాగే పర్యటన చివరి రోజున దుబాయ్ లో ఏపీ ఎన్ఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని దుబాయ్ సహా వివిధ దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, కంపెనీలను, ప్రభుత్వ ప్రతినిధులను విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సుకు ముఖ్యమంత్రి ఆహ్వానించనున్నారు. 22 తేదీన ఉదయం హైదరాబాద్ కు 10 గంటలకు చేరుకుని... అక్కడి నుంచి నేరుగా దుబాయ్ కు వెళ్లనున్నారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. దుబాయ్ చేరుకున్న తొలి రోజు నుంచే ముఖ్యమంత్రి వివిధ పారిశ్రామిక వేత్తలతో భేటీలు నిర్వహించనున్నారు. సీఎం పర్యటించే మూడు రోజుల్లో వీలైనంత మంది పారిశ్రామికవేత్తలను కలిసేలా యూఏఈ పర్యటన ఉండబోతోంది. ప్రభుత్వ ప్రతినిధులతో 3, పారిశ్రామిక వేత్తలతో 14 వన్ టు వన్, రౌండ్ టేబుల్ సమావేశాలు, 2 సైట్ విజిట్స్ 2, మీడియా ఇంటర్వ్యూలు 2, సీఐఐ పీఎస్ రోడ్ షో 1, తెలుగు డయాస్పోరా 1 సహా మొత్తం మూడు రోజుల పాటు 25 సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇక ప్రతి రోజూ ఐదారు సమావేశాలు ఉండేలా ముఖ్యమంత్రి యూఏఈ పర్యటన ఉండబోతోంది.

**తొలిరోజు పర్యటనిలా...:** తొలిరోజు పర్యటనలో భాగంగా 22వ తేదీన ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అవుతారు. వీరితో వన్ టు వన్ సమావేశాలు నిర్వహిస్తారు. వీరితో జరిపే వేర్వేరు భేటీల్లో ఇండస్ట్రీయల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు-షిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. తొలి రోజు పర్యటనలో ముఖ్యమంత్రి బృందం పలు ప్రాంతాలను సందర్శించనుంది. మ్యూజియం సందర్శనలో భాగంగా జర్నీ టూ 2071 థీమ్ తో ఉండే స్పేస్ ట్రావెల్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను సీఎం పరిశీలిస్తారు. అలాగే ఇదే మ్యూజియంలో ఏర్పాటు చేసిన భవిష్యత్ టెక్నాలజీ సొల్యూషన్స్ అనే అంశంపైనా సీఎం అధ్యయనం చేయనున్నారు. ఇక రాత్రికి సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన రోడ్ షోకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఈ రోడ్ షోలో పాల్గొని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు. అలాగే విశాఖలో వచ్చే నెల 14,15వ తేదీల్లో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు ఆహ్వానించనున్నారు. చంద్రబాబుతో పాటు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఏపీ ఇడిబి సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రిరెడ్డి దుబాయ్ పర్యటనలో పాల్గొననున్నారు.

# ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతల సంబరాలు

- సీఎం చంద్రబాబుకు ఆర్టీసి ఎండీకి కృతజ్ఞతలు తెలిపిన ఎంప్లాయిస్ యూనియన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతల ప్రక్రియకు ఆమోదం లభించిన నేపథ్యంలో ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. ఆర్టీసి ఉద్యోగులకు విలీనానికి ముందున్న పద్ధతుల్లోనే పదోన్నతుల కోసం చేసిన విజ్ఞప్తికి అనుగుణంగా, ఆర్టీసి వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు, టిఆర్ & బీ అధికారులు, రవాణా మంత్రి, ముఖ్యమంత్రిని ఒప్పించి ఆగస్టు 28న గ్రీన్ సిగ్నల్ పొందినప్పటికీ జీఏడీ అధికారుల వద్ద నిలిచిపోయిన ఫైల్ ఇటీవల కేబినెట్ ఉపసంఘంలో చర్చకు వచ్చింది.

దీపావళి సందర్భంగా ప్రభుత్వం జి.ఓ విడుదల చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలు, నాలుగు వర్క్‌షాప్‌లలో సుమారు ఆరు వేలమంది ఉద్యోగులకు పదోన్నతుల అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టిఆర్ & బీ స్పెషల్ సెక్రటరీ కృష్ణబాబు, రవాణా మంత్రి, ఆర్టీసి యం.డి ద్వారకాతిరుమలరావులకు కృతజ్ఞతలు తెలిపారు అని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్యమంత్రి ఆమోదం ఇచ్చిన వెంటనే పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకున్న యం.డిని మంగళవారం ఆర్టీసి హౌస్‌లో యూనియన్ నాయకులు కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఇంకా మిగిలిన కేటగిరీలకు కూడా విలీనానికి ముందున్న పద్ధతుల్లోనే పదోన్నతుల అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని యం.డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ.యు రాష్ట్ర నాయకులు యం.డి.ఏ.సిద్దిక్, యం.శంకరరావు, యస్.కె. మోహిద్దిన్, ఎన్.హెచ్.ఎన్.చక్రవర్తి, జి.యస్. నారాయణ, వై.యస్.రావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు**

పదోన్నతులపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరిపింది. మంగళవారం విజయవాడ డిపోలో జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, రాష్ట్రంలోని అనేక డిపోలలో ఉద్యోగులు సంబరాలు జరిపారు. బుధవారం కూడా మిగిలిన డిపోలలో స్వీట్లు పంచుకుంటూ, బాణాసంచాలు కాలుస్తూ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి, యం.డికి కృతజ్ఞతలు తెలుపుతూ వేడుకలు కొనసాగుతున్నాయని పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

# ప్రత్యేక కోర్టు ద్వారా లక్ష్మీ నాయుడు హత్య కేసు విచారణ



- విచారణ వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ముఖ్యమంత్రి చంద్రబాబు
- బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కందుకూరులో ఇటీవల హత్యకు గురైన లక్ష్మీనాయుడు కేసును ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్షపడాలని స్పష్టం చేశారు. సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారాయణ, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నాయుడు హత్యను సీఎం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన అత్యంత అమానుషమని, అమానవీయం అని వ్యాఖ్యానించారు. హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని అన్నారు. కోర్టులో కేసు విచారణ కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను నియమించాలని ఆదేశాలు ఇచ్చారు.

**రూ.5 లక్షల చొప్పున పరిహారం.. 2 ఎకరాల చొప్పున భూమి :** లక్ష్మీనాయుడు హత్యతో జీవనాధారం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. వీరితో పాటు దాడిలో గాయపడిన వారికి కూడా ప్రభుత్వం సాయం ప్రకటించింది. లక్ష్మీ నాయుడు భార్యకు 2 ఎకరాల భూమి, రూ. 5 లక్షల నగదు పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. లక్ష్మీ నాయుడి ఇద్దరు పిల్లలకు 2 ఎకరాల చొప్పున భూమి, రూ. 5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని చంద్రబాబు అధికారులను సూచించారు. అంతేకాకుండా ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇక దాడిలో గాయపడ్డ పవన్, భార్గవ్‌కు కూడా పరిహారం అందించాలని అన్నారు. పవన్‌కు 4 ఎకరాల భూమి, రూ. 5 లక్షల నగదుతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని చెప్పారు. భార్గవ్‌కు కూడా రూ. 3 లక్షల నగదు, ఆసుపత్రి ఖర్చులు చెల్లించాలని ఆదేశించారు.

**శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు:** రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ తరహా వ్యవహారాల పట్ల ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

# శ్రీశైలం అన్నప్రసాద పథకానికి పల్నాడు దాత విరాళం



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాకు చెందిన కె. వెంకటేశ్వర్లు, శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి రూ. 1,00,116 విరాళం అందజేశారు. మంగళవారం ఈ మొత్తాన్ని పథకం పర్యవేక్షకులు కె. అయ్యన్నకు ఆయన అందజేశారు. దాతకు దేవస్థానం తరఫున తగు రశీదు, శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ప్రసాదాలు, శేషవస్త్రం ఇవ్వడం జరిగింది. అలయ దానసేవల్లో దాత నీతిపూర్వక సహకారం ప్రశంసనీయమని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు - ఈఓ సమీక్ష

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** అక్టోబర్ 22 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్న కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లపై కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.నరసింహారెడ్డి, శాఖల అధిపతులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు దర్శన సౌకర్యాలు, మంచినీటి సరఫరా, పాతాళగంగలో పుణ్యస్నానాల ఏర్పాట్లు, తలనీలాల సమర్పణకు కల్యాణకట్ట సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, పార్కింగ్, పారిశుధ్య ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కార్తీకమాసంలో ప్రతీ సోమవారం, కార్తీక పౌర్ణమి రోజున జరిగే పుష్కరిణి హారతి, లక్షదీపోత్సవం, జ్వాలాతోరణోత్సవం, అక్టోబర్ 31న కృష్ణమ్మ హారతి, నవంబర్ 14న కోటి దీపోత్సవం, నవంబర్ 18న తెప్పోత్సవం వంటి కార్యక్రమాల ఏర్పాట్లను కూడా ఈఓ సమీక్షించారు.

ఆలయ ద్వారాలు ప్రతిరోజు వేకువజామున 3 గంటలకు తెరచి, ఉదయం 4.30 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయని తెలిపారు. తిరిగి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10.30 వరకు కూడా దర్శనాలు కొనసాగుతాయని చెప్పారు.



సాధారణ భక్తుల సౌకర్యార్థం కార్తీకమాసమంతా గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శని, ఆదివారాలు, సోమవారాలు, పర్వదినాలలో అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమాలు అంతరాలయం బదులుగా ఆశీర్వచన మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రుద్రహోమం, చండీహోమం, సాక్షిగణపతి హోమం, నిత్యకల్యాణం వంటి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ప్రజల రక్షణకోసం ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని తెలిపిన మంత్రి అచ్చెన్న



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజారక్షణ విధుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసుల త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రారంభంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన మంత్రి, అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తేనే ప్రజలు సంతోషంగా జీవిస్తారని ఆయన అన్నారు. విధి నిర్వర్తనలో ప్రాణాలు అర్పించిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, మానప్రాణాల రక్షణలో పోలీసులు చూపిస్తున్న అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. సరిహద్దులో దేశాన్ని కాపాడే సైనికులు ఒక ఎత్తైతే, దేశంలో ప్రజల భద్రతను కాపాడే పోలీసులు మరో ఎత్తు అని వ్యాఖ్యానించిన మంత్రి అచ్చెన్నాయుడు, పోలీసుల ధైర్యం, త్యాగం దేశానికి గర్వకారణమని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న మంత్రి, వారి త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శాంతి కోసం పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారి సేవలు ప్రజాస్వామ్య బలానికి పునాది అని పేర్కొన్నారు. మన రాష్ట్ర పోలీసు వ్యవస్థ పనితీరుపై గర్వపడుతున్నానని తెలిపారు. నక్సలిజం అరికట్టడంలో, గంజాయి మరియు మాదకద్రవ్యాల రవాణాను నియంత్రించడంలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా విచ్చలవిడిగా జరిగిందని విమర్శించారు. మాదక ద్రవ్యాల వాడకం వలనే మహిళలపై అఘాయిత్యాలు, అపహరణలు, రోడ్డు ప్రమాదాల వంటివి జరుగుతున్నాయని , వీటిని అరికట్టడంలో ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను సూచించారు. సైబర్ క్రైమ్‌పై ప్రజల్లో అవగాహన పెంచుతూ, టెక్నాలజీ సాయంతో నేరస్తులను పట్టుకోవాలన్నారు. ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. రాత్రింబవళ్లు కష్టపడే పోలీసు సిబ్బందికి నా మనఃపూర్వక అభినందనలు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత :** ఉద్యోగులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేక పోయిన డీఏ కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులది కీలక పాత్రని పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా పోలీసులను అభినందనలు తెలిపారు. రాష్ట్ర 6,300 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు నియామకం చేపట్టామని చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులు ఓపెన్ హౌస్ ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్. ఈశ్వరరావు, పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467